aruhi
aruhi group
BBTV
BBTV TELUGU
BBTVNETWORK

తెలుగు దినపత్రిక
నమస్తే
# మహాప్రభ
ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ
గురువారం
12-02-2026 సంపుటి : 01 సంచిక : 17 పేజీలు : 08 వెల : ₹ 5/- RNI NO : TGTEL/26/A0738


BESQATI
www.besqati.com
besqati.com
Contact : info@besqati.com

Published From HYDERABAD,VIJAYAWADA తెలంగాణ , ఆంధ్రప్రదేశ్. www.mahaaprabha.com MAHAAPRABHA.DAILY

## పురపోరులో
# కాంగ్రెస్‌కే పట్టం

### రెండో స్థానంలో బీఆర్ఎస్

- ఎగ్జిట్ పోల్ అంచనా ప్రకారం 68 నుచి 76 మున్సిపాల్టీలు కాంగ్రెస్,
- 29 నుంచి 36 మున్సిపాల్టీలను బీఆర్ఎస్,
- మూడు నుంచి ఐదు మున్సిపాల్టీల వరకు బీజేపీ గెలిచే అవకాశం
- 0 నుంచి 1 వరకు ఎంఐఎం గెలుచుకునే అవకాశం
- ఎగ్జిట్ పోల్స్ సర్వేల్లో వెల్లడి





హైదరాబాద్ -ఫిబ్రవరి 11(మహాప్రభ)
రాష్ట్రంలోని116 మున్సిపాల్టీలు, 7 కార్పొరేషన్ల లో జరిగిన ఎన్నికల్లో పట్టణ ఓటర్లు కాంగ్రెస్‌కే పట్టం కట్టారని పీపుల్స్ పల్స్ ఎగ్జిట్‌పోల్ సర్వే తేల్చింది. అధికార పార్టీ దాదాపు 70 శాతం మున్సిపాల్టీలు, కార్పొరేషన్లను కైవసం చేసుకోనున్నట్టు తెలిపింది. మంచిర్యాల, రామగుండం, నల్లగొండ, మహబూబ్ నగర్, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్లలో కాంగ్రెస్ జోరు కొనసాగుతుందని పేర్కొంది.
-మిగతా 3 లో

## మూడు కార్పోరేషన్లుగా హైదరాబాద్

- జలమండలి పరిధి విస్తరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు
- జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఆర్వీ కర్ణన్





హైదరాబాద్ : -ఫిబ్రవరి 11(మహాప్రభ)
జలమండలి పరిధిని విస్తరిస్తూ తెలంగాణ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. జీహెచ్ఎంసీతో పాటు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(సీఎంసీ), మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్(ఎంఎంసీ)గా విభజించింది. ఈ క్రమంలోనే మూడు కార్పొరేషన్లకు కమిషనర్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఆర్వీ కర్ణన్ కొనసాగుతుండగా.. సైబరాబాద్‌కు శ్రీజన,
-మిగతా 3 లో




## ఐఏఎస్‌ల బదిలీలు

- సింగరేణి సీఎండీగా జ్యోతి బుద్ధప్రకాశ్
- మల్కాజ్‌గిరి, సైబరాబాద్ నూతన మున్సిపల్ కార్పొరేషన్లకు కమిషనర్ల నియామకం


హైదరాబాద్ : -ఫిబ్రవరి 11(మహాప్రభ)
తెలంగాణలో పది మంది ఐఏఎస్ అధికారులు బదిలీ అయ్యారు. సింగరేణి సీఎండీగా జ్యోతి బుద్ధప్రకాశ్ నియమితులయ్యారు. ఎస్సీ అభివృద్ధిశాఖ ప్రత్యేక సీఎస్‌గా సవ్యసాచి ఘోష్ బాధ్యతలుచేపట్టనున్నారు. ఆయన గిరిజన సంక్షేమ
-మిగతా 3 లో



## థాయిలాండ్ స్కూల్‌లో నరమేధం

- దుండగుడి కాల్పుల్లో 34మంది హతం
- మృతుల్లో 22మంది చిన్నారులు

న్యూఢిల్లీ, -ఫిబ్రవరి 11(మహాప్రభ)
దక్షిణ థాయిలాండ్ లో ఘోరం జరిగింది. బుధవారం మధ్యాహ్నం సోంగ్ఖా హ్యాట్ హెయ్ జిల్లాలోని ఓ పాఠశాలలో ఓ సాయుధుడు కాల్పులకు తెగబడ్డాడు. నిందితుడు జరిపిన కాల్పుల్లో 22మంది చిన్నారులు సహా 34మంది మరణించారు. చాలా మందిని అతను బందీలుగా చేసుకున్నాడు. పాఠశాలలో కాల్పుల మోత వినపడగానే రోడ్డుపై జనాలు ఒక్కసారిగా
-మిగతా 3 లో



## అమెరికాకు తలొగ్గిన భారత ప్రభుత్వం

- వాణిజ్య ఒప్పందంతో అమెరికాకే లాభం
- ఎన్‌స్టీన్ ఫైల్స్‌లో అనిల్ అంబానీ, హర్దీప్ పురిల పేర్లు
- బడ్జెట్ చర్చలో రాహుల్ విమర్శలు
- రాహుల్ వ్యాఖ్యలపై గందరగోళం

న్యూఢిల్లీ, -ఫిబ్రవరి 11(మహాప్రభ)
అమెరికా ప్రభుత్వానికి భారత్ తలొగ్గిందని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఇరు దేశాల మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందం అమెరికాకు మేలు కలిగించేలా ఉందే తప్ప.. భారత్‌కు దీనివల్ల ఎలాంటి ప్రయోజనమూ లేదన్నారు. కేంద్ర బడ్జెట్‌పై చర్చ సందర్భంగా రాహుల్ గాంధీ లోక్‌సభలో మాట్లాడారు. తన ప్రసంగంలో వాణిజ్య ఒప్పందంతో పాటు ఏఐ ప్రభావం వంటి అంశాల గురించి ప్రస్తావించారు. ప్రపంచంలో మారుతున్న పరిణామాలకు అనుగుణంగా బడ్జెట్ ఏమాత్రం ప్రతిబింబించలేదన్నారు. ప్రపంచమంతా ఏఐ యుగంలోకి వెళ్తోందని చెబుతున్నారు. దీనివల్ల భారతీయ ఐటీ కంపెనీలు నష్టపోయే ప్రమాదం ఉంది. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ల ఉద్యోగాలకు ప్రమాదం ఉంది. మన దేశానికి ప్రతిభావంతులైన యువతరం పెద్ద ఆస్తి. ఏఐకి ఇంధనమే డేటా.. డేటా లేకుండా ఏఐ
-మిగతా 3 లో



### ఓటేసిన పలువురు ప్రముఖులు

- కొడంగ్‌లో ఓటేసిన సిఎం రేవంత్
- మధిరల ఓటేసిన భట్టి విక్రమార్క
- నిజామాబాద్ పట్టణంలో ఓటేసిన టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

హైదరాబాద్, :-ఫిబ్రవరి 11(మహాప్రభ)
మున్సిపల్ ఎన్నికలను పురస్కరించుకుని పలువురు ప్రముఖులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. కొడంగల్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు కొనసాగుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 116 మున్సిపాలిటీల్లో ఉదయం 7 గంటల నుంచే పోలింగ్ ప్రారంభమైంది. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగిం చుకుంటున్నారు. సీఎం రేవంత్ రెడ్డి, కొడంగల్ లో ఓటు వేశారు.
-మిగతా 3 లో


## ప్రశాంతంగా
# పోలింగ్.

### 73.01 శాతం మున్సిపల్ పోలింగ్

- కార్పొరేషన్లలో అత్యధికంగా నల్లగొండలో 77.36
- అత్యల్పంగా నిజామాబాద్‌లో 59.12
- మున్సిపాల్టీల్లో అత్యధికంగా చౌటుప్పల్ 91.91
- అత్యల్పంగా నందికొండలో 59.68
- కార్పొరేషన్ల కన్నా మున్సిపాల్టీల్లో 9.83 శాతం అధికం : ఎన్నికల సంఘం
- చిన్న చిన్న ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతం



హైదరాబాద్ :-ఫిబ్రవరి 11(మహాప్రభ)
రాష్ట్ర వ్యాప్తంగా 7 మున్సిపల్ కార్పొరేషన్లు, 116 మున్సిపాల్టీల్లోని 2,983 వార్డులకు బుధవారం జరిగిన ఎన్నికల్లో 73.01 శాతం పోలింగ్ నమోదైంది. ఉదయం 7 గంటలకు మొదలైన పోలింగ్ సాయంత్రం 5 గంటలతో ముగిసింది. గడువులోగా పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న ఓటర్లకు ఓటు వేసేందుకు అధికారులు అవకాశం కల్పించారు. దాంతో కొన్ని చోట్ల రాత్రి 7 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. ఉదయం మందకోడిగా మొదలైన పోలింగ్ మధ్యాహ్నానికి పుంజుకుంది.
-మిగతా 3 లో



## అమెరికా మమ్ముల్ని టాయిలెట్ పేపర్‌లా వాడుకున్నది

- టాయ్‌లెట్ పేపర్ కన్నా నీచంగా వాడేసారు
- అనవసర యుద్ధాల్లోకి మమ్మలను లాగారు
- అఫ్ఘాన్ వ్యతిరేక యుద్ధంలో పాల్గొనడంతో తీరని నష్టం
- అమెరికా తీరుపై తీవ్ర విమర్శలు గుప్పించి పాక్ రక్షణ మంత్రి

3 లో

## ఇకపై స్కూళ్లలో
# వందేమాతరం తప్పనిసరి.

- జగనణమన కంటే ముందే పాడాలి..
- వందేమాతరం ఆలపించేటప్పుడు అందరూ తప్పనిసరిగా నిలబడాలి.
- గేయంలోని ఆరు చరణాల్ని ఆలపించాల్సిందే
- కేంద్ర హోం శాఖ కీలక ఆదేశాలు జారీ

న్యూఢిల్లీ -ఫిబ్రవరి 11(మహాప్రభ)
జాతీయ గేయం 'వందేమాతరం' ఆలపించే విషయంలో కేంద్ర హోం శాఖ కీలక ఆదేశాలు జారీ చేసింది. ఇకపై ప్రతి పాఠశాలలో తప్పనిసరిగా జాతీయ గేయం 'వందేమాతరం' ఆలపించాలని అని ఆదేశించింది. జాతీయ గీతం 'జనగణమన' పాడటానికి ముందు వందేమాతరం కూడా పాడాలని ఆదేశించింది. ఈ మేరకు బుధవారం ఉదయం తాజా ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాల ప్రకారం వందేమాతరం ఆలపించేటప్పుడు అందరూ తప్పనిసరిగా నిలబడాలి. గేయంలోని ఆరు చరణాల్ని ఆలపించాల్సిందే. వీటిలో కాంగ్రెస్ 1937లో తొలగించిన నాలుగు చరణాలు కూడా ఉన్నాయి. వాటిని కూడా ఆలపించాలి. గతంలో నెహ్రూ ఆధ్వర్యంలో సెక్యులర్ అంశాలను సాకుగా చూపి, ముస్లిం లీగ్ అభ్యంతరాల మేరకు గేయంలోని నాలుగు చరణాలను తొలగించారు. ఇప్పుడు ఎన్డీయే ప్రభుత్వం వాటిని కూడా తిరిగి చేర్చింది. ఈ అంశంపై గత ఏడాది కాంగ్రెస్,
-మిగతా 3 లో



## ఎప్‌స్టీన్ ఫైళ్లలో అనీల్ అంబానీ పేరు



**న్యూఢిల్లీ :-ఫిబ్రవరి 11(మహాప్రభ)**
ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న ఎప్‌స్టీన్ ఫైళ్లలో ప్రముఖ పారిశ్రామికవేత్త అనీల్ అంబానీ పేరు వచ్చినా.. అతనెందుకు జైలు లేరు? ఎందుకు జైలులో పెట్టలేదని లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బుధవారం లోక్‌సభలో ఎప్‌స్టీన్ ఫైల్స్‌కు సంబంధించి రాహుల్ మాట్లాడుతూ... 'వ్యాపారవేత్త అనీల్ అంబానీ ఎందుకు జైలులో లేడని నేను అడగాలనుకుంటున్నాను? దీనికి కారణం ఆయన పేరు ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో ఉంది. అతన్ని (అనీల్ అంబానీ) ఎప్‌స్టీన్‌కు పరిచయం చేసిన హర్‌దీప్ పూరిని కూడా నేను ఒకటి అడగాలనుకుంటున్నాను. అతన్ని ఎవరు పరిచయం చేశారో నాకు తెలుసు. హర్దీప్ పూరికి అతన్ని ఎవరు పరిచేశారో తెలుసు' అని అన్నారు. పరోక్షంగా రాహుల్ మోడీనుద్దేశించి వ్యాఖ్యానించారు. ఇక ఇదే విషయంపై రాహుల్ పార్లమెంటు వెలుపుల విలేకరులతో మాట్లాడుతూ.. 'హర్దీప్ పూరీ, అనీల అంబానీల పేర్లతో ఉన్న ఎప్‌స్టీన్ ఫైళ్లు న్యాయశాఖ వద్ద ఫైల్స్ ఉన్నాయి. అదానీపై కొనసాగుతున్న కేసులో ఇప్పటికే సమన్లు జారీ చేయబడ్డాయి. దీనిపై గత 18 నెలలుగా భారత ప్రభుత్వం మాత్రం స్పందించలేదు. ఈ విషయంపై ప్రధానిపై ప్రత్యక్ష ఒత్తిడి ఉంది. ఇక్కడ ప్రధాన విషయం ఏమిటంటే డేటా పరంగా చూసినా..ఇప్పటివరకు రైతులు, ఇంధన భద్రత, రక్షణ పరంగా కూడా ఏ ప్రధానమంత్రి కూడా ఎలాంటి పరిస్థితుల్లోనైనా ఇలా చేయలేదు అని అన్నారు.

## రష్యా పారిశ్రామిక కేంద్రంపై ఉక్రెయిన్ డ్రోన్ దాడి



**మాస్కో -ఫిబ్రవరి 11(మహాప్రభ)**
రష్యాపై ఉక్రెయిన్ డ్రోన్ దాడికి పాల్పడింది. రష్యా దక్షిణ ప్రాంతమైన వోల్గోగ్రాడ్‌లోని ఒక పారిశ్రామిక కేంద్రంపై జరిగిన డ్రోన్ దాడి కాల్పులకు దారితీసిందని ప్రాంతీయ గవర్నర్ ఆంద్రీ బోచరోవ్ బుధవారం తెలిపారు. ఇంధన మరియు పౌర మౌలిక సదుపాయాలపై డ్రోన్ దాడిని వైమానిక దళాలు తిప్పికొడుతున్నాయని అన్నారు. ఈదాడితో నివాససముదాయంలోని అపార్ట్‌మెంట్ ధ్వంసమైందని, కిండర్‌గార్డెన్ ఉన్న ప్రాంతంలో డ్రోన్ శిథిలాలు పడ్డాయని అన్నారు. ఈ దాడికి సంబందించి పూర్తి సమాచారం తెలియాల్సి వుందని చెప్పారు.

## మహారాష్ట్రలో భూకంపం



**హైదరాబాద్;-ఫిబ్రవరి 11(మహాప్రభ)**
మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాలోని ముఖేడ్ తాలూకాలో ఇవాళ భూకంపం సంభవించింది. దాదాపు 8 గ్రామాలు రిక్టర్ స్కేలుపై 3 తీవ్రతతో భూకంపం సంభవించినట్లు సమాచారం. ఆకస్మిక ప్రకంపనలు ప్రజల్లో భయాన్ని రేకెత్తించాయి. దీంతో చాలా మంది ఇళ్ల నుండి బయటకు పరుగులు తీశారు. ఇప్పటివరకు ఎటువంటి ప్రాణనష్టం జరగనట్లు తెలుస్తోంది. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది

## బెంగాల్‌లో బాబ్రీ మసీదు నిర్మాణం ప్రారంభం




**కోల్‌కతా: -ఫిబ్రవరి 11(మహాప్రభ)**
వివాదాస్పద బాబ్రీ మసీదు నిర్మాణం పశ్చిమ బెంగాల్‌లో బుధవారం ప్రారంభమైంది. ముర్షిదాబాద్ జిల్లా బెల్దంగాలో బుధవారం మధ్యాహ్నం ఖురాన్ పఠనం అనంతరం నిర్మాణ పనులు అధికారికంగా ప్రారంభించినట్టు జనతా ఉన్నాయన్ పార్టీ అధ్యక్షుడు హుమాయున్ కబీర్ తెలిపారుఈ శంకుస్థాపన సందర్భంగా జరిగిన ఖురాన్ పఠన కార్యక్రమంలో 1,200 మంది పాల్గొనగా, నిర్మాణ పనుల్లో 5 వేల మంది భాగస్వాములయ్యారు.


# రాహుల్ గాంధీవి అర్థంలేని ఆరోపణలు..

**-ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో తన పేరుపై హర్దీప్ పూరి క్లారిటీ**



**న్యూఢిల్లీ :-ఫిబ్రవరి 11(మహాప్రభ)**
ఎప్‌స్టీన్ ఫైల్స్ అంశంలో తన పేరు రావడం, వాటిపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో చేసిన ఆరోపణలపై కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరి స్పందించారు. రాహుల్ గాంధీవి నిరాధారమైన ఆరోపణలు అని తోసిపుచ్చారు. బడ్జెట్‌పై ప్రసంగం సందర్భంగా రాహుల్ పార్లమెంట్‌లో మాట్లాడుతూ.. ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరి పేరు ఉందని ప్రస్తావించారు.హర్దీప్‌తోపాటు అదానీ, అనిల్ అంబానీ పేర్లు ఉన్న విషయాన్ని కూడా రాహుల్ ప్రస్తావించారు. ఈ అంశంపై హర్దీప్ సింగ్ పూరి మీడియాతో మాట్లాడారు. తన వివరణ ఇచ్చారు. తాను ఎప్‌స్టీన్‌ను కలిసిన మాట వాస్తవమే అని, అయితే, ఆయన చేసిన నేరాలతో తనకు ఎలాంటి సంబంధం లేదన్నారు. "ఇంటర్నేషనల్ పీస్ ఇనిస్టిట్యూట్ (ఐపీఐ)లో పని చేసినప్పుడు ఎప్‌స్టీన్‌ను కలిశాను. ఐపీఐలో మా బాస్ తెజ్రె రాడ్ లార్సెన్‌కు ఎప్‌స్టీన్ తెలుసు. ఆయన ద్వారా మా సంస్థ చర్చల సందర్భంగా ఎప్‌స్టీన్‌ను మూడు, నాలుగు సార్లు కలిశాను. మా మధ్య జరిగిన సంభాషణకు, ఆయన చేసిన నేరాలకు సంబంధం లేదు. 2009 నుంచి జరిగిన అంశాలపై ఎప్‌స్టీన్ ఫైల్స్ రిలీజయ్యాయి. 2017లో నేను కేంద్ర మంత్రిగా చేరేంతవరకు న్యూయార్క్‌లో ఇండియాకు ప్రతినిధిగా పని చేశాను. ఇన్నేళ్లకాలంలో ఎప్‌స్టీన్‌ను కలిసింది మూడు నాలుగుసార్లు మాత్రమే. పూర్తి వృత్తిపరమైన అంశాల్లోనే ఆయనను కలిశాను. ఎనిమిదేళ్ల కాలంలో రెండే మెయిల్స్ చేసుకున్నాం. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి నిరాధారమైన ఆరోపణలు చేయడం అలవాటు. ఎప్‌స్టీన్ చేసిన నేరాలకు నాకు సంబంధం లేదు. అలాంటివాటికి నేను తగినవాడిని కాదు" అంటూ హర్దీప్ సింగ్ పూరి వివరణ ఇచ్చారు.

## వివాదాస్పద ప్రదేశాలతో ఇండియా మ్యాప్ పోస్ట్ చేసిన అమెరికా.. తర్వాత డిలీట్




**న్యూఢిల్లీ :-ఫిబ్రవరి 11(మహాప్రభ)**
భారత్‌తో ట్రేడ్ డీల్ కుదిరిన నేపథ్యంలో అమెరికా చేసిన ఒక పని ప్రస్తుతం చర్చనీయాంశమైంది. ఇండియాతో ట్రేడ్ డీల్‌కు సంబంధించిన వివరాలు పంచుకుంటూ ఒక ఇండియా మ్యాప్‌ను అమెరికా ప్రచురించింది. అందులో వివాదాస్పద ప్రాంతాలైన పాక్ ఆక్రమిత కాశ్మీర్, అక్సాయ్ చిన్ వంటి ప్రాంతాలున్నాయి. ఈ మేరకు అమెరికా వాణిజ్య విభాగం (యునైటెడ్ స్టేట్స్ ట్రేడ్ రిప్రజంటేటివ్) ఒక ట్వీట్ ద్వారా ఈ మ్యాప్‌ను సోషల్ మీడియాలో విడుదల చేసింది.అయితే, తర్వాత ఈ మ్యాప్‌ను డిలీట్ చేసింది. ఈ నెల 7న చేసిన పోస్టులో ఇండియా మ్యాప్‌లో పాక్ ఆక్రమిత కాశ్మీర్, అక్సాయ్ చిన్ ఉన్నాయి. ఇందులో ఒక ప్రాంతాన్ని పాక్ తమ సొంతం అని వాదిస్తుండగా, రెండో ప్రాంతం విషయంలో ఇండియాకు-చైనాకు మధ్య వివాదం నడుస్తోంది. కానీ, ఈ రెండు ప్రాంతాలు పూర్తిగా ఇండియావే అని మన దేశం ఎప్పటినుంచో చెబుతోంది. అక్సాయ్ చిన్ ఇండియాలోనే ఉన్నప్పటికీ.. చైనా కూడా ఆ ప్రాంతాలను తమవే అని క్లెయిమ్ చేసుకుంటోంది. దీనిపై భారత్ ఎప్పటినుంచో చైనాపై విమర్శలు చేస్తూ వస్తోంది. అలాంటి వివాదాస్పద ప్రాంతాలను అమెరికా ప్రచురించడం ఆసక్తి కలిగిస్తోంది. పాక్ ఆక్రమిత కాశ్మీర్ విషయంలో ఇండియాకు అమెరికా మద్దతు ఇస్తోందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.అలాగే చైనాతో కూడా అమెరికా ఈమధ్య కాలంలో ఎక్కువగా విబేధిస్తోంది. అందుకే అక్సాయ్ చిన్ విషయంలో తన మద్దతు ఇండియాకే అని అమెరికా స్పష్టం చేసిందా..? ముందు అమెరికా పోస్టు చేసి, తర్వాత డిలీట్ చేసినప్పటికీ ప్రస్తుతం ఈ అంశంపై చర్చ జరుగుతోంది. అయితే, వివాదాస్పద ప్రాంతాల విషయంలో ఈ చర్య భౌగోళిక రాజకీయ ఆమోదం అని చాలా మంది విశ్లేషకులు భావిస్తున్నారు.

# బంగ్లాదేశ్ ఎన్నికలకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు



**ఢాకా న్యూఢిల్లీ :-ఫిబ్రవరి 11(మహాప్రభ)**
: బంగ్లాదేశ్ సార్వత్రిక ఎన్నికలు నేడు (ఫిబ్రవరి 12) జరగనున్నాయి. 2024 ఆగస్టులో ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లకు సంబంధించి ఆ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనా ఆదేశాలకు వ్యతిరేకంగా యువత దేశవ్యాప్త నిరసనలు చేపట్టింది. ఈ నిరసనల్లో దాదాపు 15 వందల మంది చనిపోయారు. ఈ ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రధాని పదవికి షేక్ హసీనా రాజీనామా చేసి దేశం విడిచి వెళ్లిపోయారు. ఆ తర్వాత మొహమ్మద్ యూనస్ నేతృత్వంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటైంది. దాదాపు సంవత్సరన్నర తర్వాత బంగ్లాదేశ్‌లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో దాదాపు 50 శాతం పోలింగ్ బూత్‌ల వద్ద ఘర్షణలు జరిగే అవకాశం ఉంది. దీంతో పోలీసులు పోలింగ్ బూత్‌ల వద్ద పోలీసులు కట్టుదిట్టమైన భారీ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారని ఎన్నికల అధికారులు వెల్లడించారు. అలాగే ఆ దేశ రాజధాని ఢాకాలో పోలీసులు కెమెరాలు ధరించి భారీగా మోహరించారు. దాదాపు 90 శాతం బూత్‌లు సిసిటివిల పర్యవేక్షణలో ఉన్నాయని అధికారులు వెల్లడించారు. కాగా, ఈ ఎన్నికలు బంగ్లా దేశ ఎన్నికల చరిత్రలో ఇప్పటివరకు జరగని విధంగా జరగనున్నాయి. ఈ ఎన్నికల సందర్భంగా ఎలాంటి ఘర్షణలు, అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చూసేందుకు భారీస్థాయిలో పోలీసులు మోహరించనున్నారు. అలాగే సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా ఉపయోగించనున్నామని ఎన్నికల సంఘం అధికారులు తెలిపారు. ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో భారీ భద్రతా ఏర్పాట్లు చేయాలని పోలీసుల్ని కోరామని ఎన్నికల కమిషనర్ అబ్దుల్ ఫజల్ మొహమ్మద్ సనావుల్లా తెలిపారు. రాజధాని ఢాకాలో 2,131 పోలింగ్ కేంద్రాల్లో.. 1,614 కేంద్రాలు హై రిస్క్‌గా ఉన్నట్లు గుర్తించామని పోలీస్ ఇన్‌స్పెక్టర్ జనరల్ బహరుల్ ఆలం అన్నారు. ఎన్నికలు నిష్పాక్షికంగా జరపడానికి దేశవ్యాప్తంగా దాదాపు 958,000 మంది పోలీసులు మోహరించినట్లు ఎన్నికల కమిషనర్ అబ్దుల్ ఫజల్ పేర్కొన్నారు.

## 16నుంచి ఢిల్లీలో అంతర్జాతీయ ఎఐ సదస్సు

**10వేల మందికి పైగా పోలీసులతో విస్తృత భద్రతా ఏర్పాట్లు**




**న్యూఢిల్లీ :-ఫిబ్రవరి 11(మహాప్రభ)**
కృత్రిమ మేథస్సు (ఎఐ)పై సదస్సుకు భారత్ ఆతిథ్యం ఇస్తోంది. ఈ నెల 16నుండి 20వ తేదీ వరకు జరిగే ఈ సదస్సు కోసం పలువురు ప్రపంచ నేతలు, అగ్ర స్థాయి టెక్ కంపెనీల సిఇఓలు, వేలాదిమంది ప్రతినిధులు దేశ రాజధానికి రానున్నారు. ఇందుకోసం విస్తృతంగా భద్రతా ఏర్పాట్లు, అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. సదస్సు జరిగే భరత మండపంలో, చుట్టుపక్కలా 10వేల మందికి పైగా పోలీసులను మోహరిస్తున్నారు. అతిథుల జాబితాలో ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మాక్రాన్, బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డసిల్వా, గూగుల్ సిఇఓ సుందర్ పిచారు వంటి నేతలు వున్నారు. వీరు కాకుండా యూరప్, ఆసియా దేశాలకు చెందిన పలువురు నేతలు, ప్రముఖులు వున్నారు. 30దేశాల నుండి 10వేల మందికి పైగా విదేశీ ప్రతినిధులు రానున్నారు. ఇప్పటికే 1.5లక్షల మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఇటీవలి కాలంలో ఢిల్లీలో జరుగుతున్న అంతర్జాతీయ సమావేశాల్లో ఇది అతి పెద్దది. విఐపిలు ప్రయాణించ సమయాల్లో ట్రాఫిక్ మళ్లింపులు, ఇతర అంశాలను సోషల్ మీడియా ద్వారా ఢిల్లీ పోలీసులు పంచుకుంటున్నారు. హోటళ్ళలో ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఒక్క రాత్రికి సూట్ బుకింగ్ చార్జి రూ.11నుండి 30లక్షల వరకు వుంటోంది. సాధారణ గదులైతే ఒక్క రాత్రికి రూ.5.5లక్షల వరకు వుంది. ఇదే సమయంలో ఇంటర్ బోర్డు పరీక్షలు కూడా వుండడంతో సామాన్యులు తీవ్రంగా ఇబ్బందులు పడే పరిస్థితులు నెలకొన్నాయి.

## ఇకపై స్కూళ్లలో వందేమాతరం తప్పనిసరి.

మొదటి తరువాయి

బీజేపీ మధ్య మాటలయుద్ధం నడిచింది. తాజా మార్గదర్శకాల ప్రకారం సినిమా హాళ్లలో వందేమాతరం ప్లే చేయాల్సిన అవసరం లేదు. అలాగే థియేటర్లలో లేదా న్యూస్ రీల్స్‌లో ఈ గేయం ప్లే అవుతుంటే నిలబడాల్సిన అవసరం లేదు. ఇలాంటి చోట్ల ఎక్కువ మంది నిలబడటం వల్ల కార్యక్రమానికి ఆటంకం కలగడం, అలాగే శాంతి భద్రతల సమస్యను దృష్టిలో ఉంచుకుని తాజా ఆదేశాలిచ్చింది. 'వందేమాతరం' ఆలపించడానికి మూడు నిమిషాల 10 సెకండ్ల సమయం పడుతుందని కేంద్రం వెల్లడించింది. ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలు అయినటువంటి రాష్ట్ర వేడుకలు, పౌర సన్మానాలు, రాష్ట్రపతి పర్యటన, గవర్నర్లు, లెఫ్టినెంట్ గవర్నర్లు, మంత్రులు పాల్గొనే వేడుకలు, జాతీయ పతాకావిష్కరణ వంటి కార్యక్రమాల సందర్భంగా ఇకపై వందేమాతరం ఆలపించాలి. ఇప్పటికే పద్మ వంటి కేంద్ర అవార్డులు ప్రదానం చేసే వేడుకల్లో ఈ గేయాన్ని ఆలపిస్తున్నారు. ఈ నిబంధనలు అతిక్రమించి జాతీయ గేయాన్ని అవమానిస్తే వారికి గరిష్టంగా మూడేళ్ల వరకు జైలు శిక్ష విధించే అవకాశం ఉంది. 'వందేమాతరం' గేయాన్ని 1875లో బంకించంద్ర ఛటర్జీ రచించారు. తర్వాత దీన్ని ఆయనే తన ఆనంద్ మఠ్ అనే నవలలో భాగం చేశారు. ఈ గేయాన్ని రచించి 150 ఏళ్లు పూర్తైన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తోంది. దీనిలో భాగంగానే తాజా ఆదేశాలిచ్చింది.

## అమెరికాకు తలొగ్గిన భారత ప్రభుత్వం

మొదటి తరువాయి

ఏమీ చేయలేదు. అమెరికా సూపర్ పవర్‌గా కొనసాగాలంటే భారత్ డేటానే కీలకం. గతంలో అధిక జనాభాను సమస్యగా భావించేవారు.. కానీ జనాభా మనకు అతిపెద్ద ఆస్తి. కానీ మన డేటాను రక్షించుకునేందుకు ఇండియా చర్యలు తీసుకోలేదు. అమెరికా కంపెనీల కోసం ట్యాక్స్ హాలిడే ప్రకటించిందని రాహుల్ గాంధీ అన్నారు.మన దేశం ఏ దేశాల నుంచి చమురు కొనుగోలు చేయాలో అమెరికా చెబుతోంది. వాళ్లు చెప్పినట్లు చేయకపోతే 50 శాతం టారిఫ్‌లు వేస్తామని బెదిరిస్తున్నారు. అమెరికా డిమాండ్లకు తలొగ్గి కీలక వ్యవసాయ ఉత్పత్తులకు భారత్ ద్వారాలు తెరిచింది. గతంలో భారత ఉత్పత్తులపై ఒకప్పుడు కేవలం 3 శాతం పన్ను ఉండేది. ఇప్పుడు అది 18 శాతానికి చేరింది. అమెరికా దిగుమతులను 46 బిలియన్ డాలర్ల నుంచి 100 బిలియన్ డాలర్లకు పెంచేశారు. భారత్‌కు ఈ ఒప్పందం ఎలాంటి భరోసా ఇవ్వడం లేదు. డాలర్‌ను రక్షించుకునేందుకు ఈ ఒప్పందం దోహదపడుతోందని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న ఎప్‌స్టీన్ ఫైల్లో ప్రముఖ పారిశ్రామికవేత్త అనీల్ అంబానీ పేరు వచ్చినా.. ఎందుకు జైలులో పెట్టలేదని లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వ్యాపారవేత్త అనీల్ అంబానీ ఎందుకు జైలులో లేడని నేను అడగాలనుకుంటున్నాను? దీనికి కారణం ఆయన పేరు ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో ఉంది. అతన్ని (అనీల్ అంబానీ) ఎప్‌స్టీన్‌కు పరిచయం చేసిన హర్‌దీప్ పూరిని కూడా నేను ఒకటి అడగాలనుకుంటున్నాను. అతన్ని ఎవరు పరిచయం చేశారో నాకు తెలుసు. హర్దీప్ పూరికి అతన్ని ఎవరు పరిచేశారో తెలుసు' అని అన్నారు. పరోక్షంగా రాహుల్ మోడీనుద్దేశించి వ్యాఖ్యానించారు. బ్జడెట్‌పై ప్రసంగం సందర్భంగా రాహుల్ గాంధీ ఎప్‌స్టీన్ ÷ల్స్ గురించి ప్రస్తావన తీసుకురాగా.. స్పీకర్ స్థానంలో ఉన్న జగదాంబికా పాల్ అభ్యంతరం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా అదానీ, అనిల్ అంబానీ, హర్దీప్‌సింగ్ పూరీ పేర్లను ప్రస్తావించడంపై రవిశంకర్ ప్రసాద్ పాయింట్ ఆఫ్ ఆర్డర్ లేవనెత్తారు. దీంతో రాహుల్ గాంధీ వ్యాఖ్యలను రికార్డులను తొలగించాలని స్పీకర్ ఆదేశించారు. బ్జడెట్ గురించి మాత్రమే మాట్లాడాలని స్పీకర్ సూచించారు. పలుమార్లు రాహుల్ గాంధీ మాట్లాడేందుకు ప్రయత్నించగా.. అధికారపక్ష సభ్యుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. అమెరికాకు తలొగ్గి డేటాను, వ్యవసాయాన్ని, ఇంధన రంగాన్ని అమ్మకానికి పెట్టారంటూ రాహుల్ గాంధీ వ్యాఖ్యానించి తన ప్రసంగాన్ని ముగించారు.

## ఓటేసిన పలువురు ప్రముఖులు

మొదటి తరువాయి

వికారాబాద్ జిల్లాలోని కొడంగల్ జడ్పీ హైస్కూల్ లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ కు వెళ్లి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం ఆయన హైదరాబాద్‌కు తిరిగి బయల్దేరారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మధిరలో ఓటేశారు. నిజామాబాద్ పట్టణంలో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఓటు హక్కు వినియోగించుకున్నారు. కరీంనగర్ పట్టణంలో ఓటేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్.. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు అనే ఆయుధాన్ని కుటుంబ సభ్యులతో కలిసి వినియోగించుకోవాలని బండి సంజయ్ కోరారు. మంచిర్యాలలోని హైటెక్‌సిటీలో 227వ నంబర్ పోలింగ్ బూత్‌లో మంత్రి వివేక్ వెంకటస్వామి ఓటు వేశారు. కామారెడ్డి పట్టణంలోని 151 పోలింగ్ బూత్ లో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ ఆలీ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎంపి ధర్మపురి అర్వింద్ తదితరులు కూడా తమ ఓటు హక్కను వినియోగించుకున్నరు. రాష్ట్రంలోని ఏడు కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు జరుగుతున్న ఈ పోలింగ్ సాయంత్రం 5 గంటలకు ముగిసింది.

## థాయిలాండ్ స్కూల్‌లో నరమేధం

మొదటి తరువాయి

పరుగులు పెట్టారు. దీనికి సంబంధించిన ఓ వీడియో ఇంటర్నెట్ లో వైరల్ అవుతోంది. సంఘటన గురించి సమాచారం అందిన వెంటనే స్థానిక పోలీసులు అక్కడికి చేరుకున్నారు. అనేక మంది ఉపాధ్యాయులు, విద్యార్థులు పాఠశాల లోపల చిక్కుకున్నారని పోలీసులు తెలిపారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు హాట్ యాయ్ పోలీసులు పాఠశాలను చుట్టుముట్టారు. సాయుధుడితో చర్చలు జరిపేందుకు ప్రయత్నిస్తున్నారు. కాల్పులు జరిపిన వ్యక్తికి 18 ఏళ్ల వయసు ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. పాఠశాల లోపల ఉన్న బందీలను సురక్షితంగా విడిపించేందుకు భద్రతా దళాలు ప్రస్తుతం ఆపరేషన్ నిర్వహిస్తున్నాయి. అయితే తరవాత అతను ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం.


## ఐఏఎస్‌ల బదిలీలు

మొదటి తరువాయి

ప్రత్యేక సీఎస్‌గానూ కొనసాగుతారు. ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్న సందీప్‌కుమార్ సుల్తానియాకు ప్రణాళికా శాఖతో పాటు తెలంగాణ రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్స్ సెంటర్ డైరెక్టర్ జనరల్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. సెర్ప్ అడిషనల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న కాత్యాయనీదేవికి ప్రజావాణి రాష్ట్ర నోడల్ అధికారిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. అమె స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ జేఎమ్‌డీగా కూడా బాధ్యతలు నిర్వహిస్తారు. సెర్ప్ సీఈవోగా పనిచేస్తున్న డీ దివ్యకు పంచాయతీరాజ్ కమిషనర్‌గా ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. అక్కడ పనిచేస్తున్న శృతి ఓజాను రిలీవ్ చేశారు. జలమండలి జేఎండీగా మయాంక్ మిట్టల్ నియమితులయ్యారు. పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శిగా రఘురామ్‌శర్మ బాధ్యతలు చేపట్టనున్నారు. ఆయన మంత్రి శ్రీధర్‌బాబు ఓఎస్‌డీగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) కమిషనర్‌గా ఆర్వీ కర్ణన్ కొనసాగుతారు. నూతనంగా ఏర్పడిన సైబరాబాద్, మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లుగా జీహెచ్‌ఎంసీలో అడిషనల్ కమిషనర్లుగా పనిచేస్తున్న జీ శ్రీజన, టీ వినయ్ కృష్ణారెడ్డి నియమితులయ్యారు.

# ప్రశాంతంగా పోలింగ్..

మొదటి తరువాయి




7 కార్పొరేషన్లలో 66.05 శాతం, 116 మున్సిపాల్టీల్లో 75.88 శాతం నమోదైంది. కార్పొరేషన్లతో పోల్చుకుంటే మున్సిపాల్టీల్లో 9.83 శాతం పోలింగ్ ఎక్కువగా నమోదైంది. ఉదయం ఏడు నుంచి 9 గంటల వరకు మొదటి రెండు గంటల్లో 11.06 పోలింగ్ నమోదు కాగా, అ తర్వాత 9 నుంచి 11 గంటల వరకు 28.48 శాతం ఓటింగ్ నమోదైంది. 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు 48.54 శాతం, ఒంటి గంట నుంచి 3గంటల వరకు 62.55 శాతం, ఓవరాల్‌గా 73.01 శాతంగా పోలింగ్ నమోదైందని రాష్ట్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. కార్పొరేషన్లలో అత్యధికంగా నల్లగొండలో 77.36 శాతం, ఆ తర్వాత భద్రాద్రి కొత్త గూడెంలో 74.52 శాతం పోలింగ్ నమోదైనట్టు పేర్కొంది. అత్యల్పంగా నిజామాబాద్‌లో 59.12 శాతం, ఆ తర్వాత కరీంనగర్‌లో 62.98 శాతం పోలింగ్ నమోదైంది. మున్సిపాల్టీల్లో అత్యధికంగా యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ లో 91.91 శాతం, ఆ తర్వాత మూడు జిల్లాలో 90 శాతానికి పైగా పోలింగ్ జరిగింది. నల్లగొండ జిల్లా చండూర్‌లో 91.52, సంగారెడ్డి జిల్లా జిన్నారంలో 90.98, యాదాద్రి జిల్లా పోచంపల్లిలో 90.95 శాతం పోలింగ్ నమోదైనట్టు రాష్ట్ర ఎన్నికల సంఘం తెలిపింది. అత్యల్పంగా నల్లగొండ జిల్లా నందికొండలో 59.68 శాతం, ఆ తర్వాత నిర్మల్ జిల్లా భైంసాలో 62.71, ఆసీఫాబాద్ జిల్లా కాగజ్ నగర్‌లో 64.32, భూపాల్‌పల్లిలో 68.18 శాతం పోలింగ్ నమోదైందని పేర్కొంది. మొత్తం 52,17,413 మంది ఓటర్లకు గాను 38,09,406 మంది ఓటింగ్‌లో పాల్గొన్నారని ఈసీ వెల్లడించింది. ఇందులో 18,51,829 మంది పురుషులు (72.63) శాతం, 19,57,226 మంది మహిళలు (73.39 శాతం), ఇతరులు 351(55.02శాతం) ఓటింగ్‌లో పాల్గొన్నారని ఎన్నికల సంఘం తెలిపింది. పురఓటర్లు పార్టీల భవిష్యత్‌ను ఓటు రూపంలో బ్యాలెట్‌బాక్స్‌లో భద్రపర్చారు. విజయం ఎవరిని వరిస్తుందో శుక్రవారం తేలనుంది.

**ప్రశాంతంగా పోలింగ్..**

మున్సిపల్ ఎన్నికలు ప్రశాతంగా ముగిశాయి. ఉదయం ప్రశాంతంగా ప్రారంభమైనప్పటికీ పోలింగ్ ముగిసే సమయానికి రాష్ట్రంలో చిన్న చిన్న ఘటనలు నమోదయ్యాయి. ప్రధాన పార్టీల మధ్య వాగ్వాదాలు, ఘర్షణలు చోటు చేసుకున్నాయి. పలు చోట్ల రాజకీయ పార్టీ నేతలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి, ఎంపీ అర్విద్ పోలీసులతో బాహాబాహికి దిగారు. అయితే ఉన్నతాధికారులు సర్దిచెప్పడంతో వారు శాంతించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

# అమెరికా మమ్ముల్ని టాయిలెట్ పేపర్‌లా వాడుకున్నది

టాయ్‌లెట్ పేపర్ కన్నా నీచంగా వాడేసారు
అనవసర యుద్ధాల్లోకి మమ్మలను లాగారు
అఫ్ఘాన్ వ్యతిరేక యుద్ధంలో పాల్గొనడంతో తీరని నష్టం
అమెరికా తీరుపై తీవ్ర విమర్శలు గుప్పించి పాక్ రక్షణ మంత్రి



**ఇస్లామాబాద్,**

ఒక దేశానికి ఇంత కంటే అవమానం ఏముంటుందీ.. ప్రతి దానికీ అడుక్కోవటం మొదలైతే ఇంత కన్నా విలువ ఎవరిస్తారు.. పక్క దేశంపై ఏడుపులు, పెడబొబ్బులు.. దాడులు.. కుట్రలు, విధ్వంసంతో నిత్యం హింసతో బతికే దేశానికి ఇంత కంటే గౌరవం ఎవరిస్తారు.. ఇవన్నీ మన పక్కనే ఉన్న పాకిస్తాన్ దేశం గురించే.. పాకిస్తాన్ దేశాన్ని టాయిలెట్ పేపర్ కంటే నీచంగా.. నీచాతి నీచంగా చూస్తున్నారని స్వయానా రక్షణమంత్రి వాపోయారు. స్వయంగా పాక్ పార్లమెంట్‌లో ఏడుస్తూ చెప్పిన మాటలు.. పాకిస్తాన్ దేశం గౌరవం అమెరికా దగ్గర ఎలా ఉంది అంటే.. టాయిలెట్ పేపర్.. టిష్యూ పేపర్ కంటే నీచంగా ఉందంటూ ఆయన మాట్లాడిన మాటలు ఇప్పుడు వైరల్ అయ్యాయి. పాకిస్తాన్ రక్షణ శాఖ మంత్రి ఆసిఫ్ ఖవాజా ఆ దేశ పార్లమెంట్ సాక్షిగా షాకింగ్ కామెంట్స్ చేశారు. అమెరికా తన సొంత ప్రయోజనాల కోసం పాకిస్తాన్‌ను టాయిలెట్ పేపర్ కంటే దారుణంగా వాడుకుని వదిలేసిందని వాపోయారు. అమెరికాతో సత్సంబంధాలు పాకిస్తాన్‌ను బలహీనపరిచి అస్థిరంగా మార్చిందని సంచలన వ్యాఖ్యలు చేశారు. 1999 తర్వాత అమెరికాతో కలిసి పనిచేయాలని పాకిస్తాన్ తీసుకున్న నిర్ణయం దేశానికి తీవ్ర నష్టాన్ని కలిగించిందని అన్నారు. పాకిస్తాన్ ఎప్పుడూ తమకు సంబంధం లేని యుద్ధాల్లోకి లాగబడిం దని ఆయన బహిరంగంగా అంగీకరించారు. అమెరికా తన రాజకీయ ప్రాధాన్యాలు, అవసరాలు, వ్యూహాత్మక ప్రయోజనాల కోసం తమ దేశాన్ని వాడుకొందని అన్నారు. తర్వాత తమను టాయిలెట్ పేపర్ కంటే ఘోరంగా తీసిపారేసిందన్నారు. అఫ్గానిస్థాన్ విషయంలో 1999 తర్వాత అమెరికాతో చేతులు కలపడం తాము చేసిన పెద్ద తప్పిదమని అన్నారు. దీనివల్ల దేశం చాలా నష్టపోయిందని.. దాని పర్యవసానాలను ఇప్పటికీ అనుభవిస్తోందని వాపోయారు. 1999లో అప్పటి పాక్ సైన్యాధిపతి జనరల్ పర్వేజ్ ముషారఫ్ నేతృత్వంలోని సైన్యం.. ప్రధాన మంత్రి నవాజ్ షరీఫ్ ప్రభుత్వాన్ని కూల్చేసి అధికారాన్ని చేజిక్కించు కుందని ఆసిఫ్ ఖవాజా అన్నారు. 2001 తర్వాత అమెరికా మద్దతుతో ఉగ్రవాదాన్ని నిర్మూలించడానికి తాలిబన్లకు వ్యతిరేకంగా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుందని పేర్కొన్నారు. అయితే, తాలిబన్లు తిరిగి తమపై హింసకు పాల్పడ్డారన్నారు. తాము ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పుడు అగ్రరాజ్యం తమకు ఎటువంటి సహాయం చేయలేదని ఆరోపించారు. ఆఫ్ఘాన్‌పై అమెరికా చేసిన యుద్ధానికి పాక్ మద్దతు ఇవ్వడం ద్వారా తాలిబన్లకు పాకిస్తాన్ వ్యతిరేకంగా మారిందని ఒప్పుకున్నారు. అమెరికా చివరికి ఈ ప్రాంతం నుండి వైదొలగడంతో పాకిస్తాన్ దీర్ఘకాలిక హింస, తీవ్రవాదం, ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటోందని అన్నారు. అమెరికాను సంతృప్తి పరచడానికే పాక్ మాజీ సైనిక పాలకులు జియా-ఉల్-హక్, పర్వేజ్ ముషారఫ్ ఆఫ్ఘనిస్తాన్ యుద్ధంలో చేరారని పేర్కొన్నారు. మనం ఎదుర్కొన్న నష్టాలను ఎప్పటికీ భర్తీ చేయలేమని.. పాకిస్తాన్ చేసిన తప్పులను తిరిగి మార్చలేనివి అని అన్నారు. ఇటీవల అమెరికాతో పాక్ చెట్టాపట్టాలేసుకుని తిరుగుతోంది. ఈ క్రమంలో అమెరికాకు వ్యతిరేకంగా పాక్ రక్షణ మంత్రి ఆసిఫ్ ఖవాజా బహిరంగంగా వ్యాఖ్యలు చేయడం చర్చనీయాంశంగా మారింది.

# పురపోరులో కాంగ్రెస్‌కే పట్టం

మొదటి తరువాయి

కరీంనగర్, నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లను బీజేపీ దక్కించుకునే అవకాశం ఉందని అంచనా వేసింది.ఫలితంగా ఆ పార్టీ రాబోయే అసెంబ్లీ ఎన్నికల వరకు రాష్ట్రంలో తన బలాన్ని మరింతగా పెంచుకునే అవకాశం ఉందని తెలిపింది. ఎగ్జిట్ పోల్ అంచనా ప్రకారం 68 నుచి 76 మున్సిపాల్టీలు కాంగ్రెస్, 29 నుంచి 36 మున్సిపాల్టీలను బీఆర్ఎస్, మూడు నుంచి ఐదు మున్సిపాల్టీల వరకు బీజేపీ గెలిచే అవకాశముందని తెలిపింది. 0 నుంచి 1 వరకు ఎంఐఎం గెలుచుకునే అవకాశం ఉందని తెలిపింది. 8 నుంచి 14 మున్సిపాల్టీల్లో రెండు పార్టీల మధ్య కొద్దితేడాతో ఫలితాలు మారే అవకాశం ఉందని వెల్లడించింది. మొత్తం 116 మున్సిపాల్టీల్లో కాంగ్రెస్ కు 36 శాతం, బీఆర్ఎస్‌కు 29.7 శాతం, బీజేపీకి 19.3 శాతం, ఎంఐఎంకు 2 శాతం ఓట్లు వచ్చే అవ కాశాలు ఉన్నాయని పేర్కొంది. వార్డుల వారీగా చూస్తే.. కాంగ్రెస్ పార్టీ 1210 నుంచి 1290 వార్డుల్లో, బీఆర్ఎస్ 860 నుంచి 930, బీజేపీ 250 నుంచి 270, ఎంఐఎం 35 నుంచి 44, సీపీఐ 12 నుంచి 17, సీపీఎం 10 నుంచి 14, ఇతరులు 90 నుంచి 110 వార్డులు గెలుచుకునే అవకాశముందని సర్వే తెలిపింది. నిజామాబాద్, కరీంనగర్, మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్లలో ఎంఐఎం కింగ్ మేకర్ కానుంది. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పార్టీ ఒక్క మున్సిపల్ కార్పొరేషన్ కూడా గెలిచే అవకాశాలు లేవని తేల్చింది. అయితే వార్డుల వారీగా చూస్తే ఆ పార్టీ రెండో స్థానంలో నిలవనుందని పేర్కొంది.

**బీకాన్ సంస్థ సర్వే...**

బీకాన్ సంస్థ సర్వే ప్రకారం కాంగ్రెస్ పార్టీ 80-85 మున్సిపాల్టీలను గెలవబోతోందని అంచనా వేసింది. ఇక బీఆర్ఎస్ 8-10, బీజేపీ 4-6 మున్సిపాలిటీలను కైవసం చేసుకోబోతోందని, 21 మున్సిపాల్టీల్లో హంగ్ లేదా ఇతరులు కైవసం చేసుకోబోతున్నట్టు తేల్చింది.

**ఆపరేషన్ చాణ్యక్య సర్వే...**

ఆపరేషన్ చాణక్య సర్వే ప్రకారం మొత్తం మున్సిపల్ వార్డుల్లో కాంగ్రెస్ 1400-1449 (48.0 శాతం) బీఆర్ఎస్ 745 -793 (26.06 శాతం), బీజేపీ 358-399 (13.04శాతం), ఎంఐఎం 150 - 187(6.03 శాతం), జనసేన 30-35 (1.02 శాతం) ఇతరులు 80-119(4శాతం) కైవసం చేసుకోబోతున్నట్లు తేల్చింది.


# మూడు కార్పోరేషన్లుగా హైదరాబాద్

మొదటి తరువాయి

మల్కాజ్‌గిరి వినయ్ కృష్ణారెడ్డిలను రాష్ట్ర సర్కార్ నియమించింది. కాగా.. ఓఆర్ఆర్ పరిధిలో నీటి సరఫరా, సివరేజ్ నిర్వహణను జీహెచ్‌ఎంసీ నుంచి జలమండలికి బదిలీ చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. నీటి సరఫరా, మురుగు వ్యవస్థలతో పాటు సంబంధిత మౌలిక వసతుల అభివృద్ధిని కూడా జలమండలి చేపట్టనుంది. నీటి సరఫరా, మురుగు వ్యవస్థలతో పాటు సంబంధిత మౌలిక వసతుల అభివృద్ధి కూడా చేపట్టనుంది. మల్కాజ్‌గిరి జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఎస్.పంకజ, హైదరాబాద్ ఈడీగా సామ్రాట్ అశోక్, సైబరాబాద్ ఈడీగా ఎం.సంతోష్, లోక్‌భవన్ జాయింట్ సెక్రటరీగా కె.శశి కిరణాచారిలను రాష్ట్ర సర్కార్ నియమించింది. అలాగే.. కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్ జోన్‌లతో కలిపి సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేసింది. ఎల్‌బీ నగర్, ఉప్పల్, మల్కాజిగిరి జోన్ ప్రాంతాలతో మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేయగా.. సికింద్రాబాద్, ఖైరతాబాద్, గోల్కొండ, చార్మినార్, రాజేంద్రనగర్, శంషాబాద్ జోన్‌లతో జీహెచ్‌ఎంసీని విభజించింది. ప్రస్తుతం 1450 చదరపు కిలోమీటర్ల మేర మంచినీటి సరఫరాతో పాటు 650 చ.కి.మీ.ల మేర సివరేజ్ నిర్వహణ చేస్తున్న జలమండలి.. ఇక నుంచి 2,053 చ.కి.మీ. మేర మంచినీటి సరఫరాతో పాటూ సివరేజ్ నిర్వహణ చూడనుంది. కొత్తగా అవసరమైన ప్రాంతాల్లో సీవరేజ్ ట్రీట్మెంట్ ఎ÷-లాంట్లు నిర్మించేందుకు జలమండలి చర్యలు తీసుకోనుంది. జీహెచ్‌ఎంసీని మొత్తం 6 జోన్లు, 30 సర్కిళ్లు, 150 వార్డులుగా ప్రభుత్వం విభజించింది. శంషాబాద్, రాజేంద్రనగర్, చార్మినార్, గోల్కొండ, ఖైరతాబాద్, సికింద్రాబాద్‌లను జోన్లుగా నిర్ణయించింది. ఆయా జోన్ల పరిధిలో సర్కిళ్ల వివరాలు ఇలా ఉన్నాయి. శంషాబాద్ జోన్: ఆదిభట్ల, బడంగ్‌పేట్, జల్‌పల్లి, శంషాబాద్. చార్మినార్ జోన్: సంతోష్ నగర్, యాకత్‌పురా, మలక్‌పేట, చార్మినార్, మూసారాంబాగ్. ఖైరతాబాద్ జోన్: ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, బోరబండ, యూసుఫ్‌గూడ, అమీర్‌పేట. రాజేంద్రనగర్ జోన్: రాజేంద్రనగర్, అత్తాపూర్, బహదూర్‌పుర, ఫలక్‌నుమా, చాంద్రాయణగుట్ట, జంగమ్మెట్, గోల్కొండ జోన్: గోషామహల్, కార్వాన్, గోల్కొండ, మెహిదీపట్నం, మాసాబ్ ట్యాంక్. సికింద్రాబాద్ జోన్: కవాడిగూడ, ముషీరాబాద్, అంబర్‌పేట్, తార్నాక, మెట్టుగూడ

# సంపాదకీయం

## స్పీకర్ సమవర్తిగా ఉండాల్సిందే !




స్పీకర్ సమర్థతపైనే చట్టసభల్లో సమస్యలపై చర్చ సాగుతుంది. స్పీకర్ నిజాయితీగా, నిష్పక్షపాతంగా ఉంటే చట్టసభల్లో అర్థవంతమైన చర్చకు అవకాశం ఉంటుంది. అసెంబ్లీ అయినా పార్లమెంట్ అయినా ఇదే వర్తిస్తుంది. గతంలో కాంగ్రెస్ హయాలో అయినా, ఎన్‌డిఎ హయాంలో అయినా చర్చలు ఫలవంతంగా సాగేవి. ప్రతిపక్షాలు ఎక్కడ ఏ సమస్యలు లేవనెత్తుతాయా అని ప్రభుత్వాలు ఒళ్లు దగ్గర పెట్టుకుని పనిచేసేవి. నీలం సంజీవరెడ్డి, బలరా÷– జాకడ్, శివరాజ్ పాటిల్, పిఎ సంగ్మా ఇలా ఎందరో స్పీకర్లు సభాధ్యక్షస్థానానికి వన్నె తెచ్చారు. సమస్యలపై చర్చలకు అవకాశం ఇచ్చారు. ఇక్కడ చర్చలంటే విపక్షం నుంచే అన్నది వేరుగా చెప్పాల్సిన అవసరం లేదు. అయితే గత 12 ఏళ్లుగా అంటే..మోడీ అధికారం చేపట్టిన తరవాత చట్టసభల్లో అర్థవంతమైన చర్చలకు ఆస్కారం లేకుండా పోయింది. అర్థవంతం కాదు కదా అసలు చర్చలకే ఆస్కారం కనిపించడం లేదు. విపక్షం నుంచి ఎవరైనా లేస్తే..స్పీకర్ మైక్ కట్ చేయడం అలవాటు చేసుకున్నారు. అలాంటప్పుడు ప్రజలు ఏమనుకుంటున్నారో ఎలా తెలుస్తుంది. నిజానికి ప్రభుత్వమే చర్చలను ఆహ్వానించాలి. తమ పాలనా విధానాలపై ప్రజల్లో ఎలాంటి ప్రభావం ఉందో అన్నది తెలుసు కోవాలి. అయితే మోడీ ప్రభుత్వం సమస్యలపై చర్చలను కోరుకోవడం లేదు. చర్చ జరిగితే సమాధానం ఇవ్వడం, ఇరుకున పడడం ప్రభుత్వానికి ఇష్టం లేదన్నది సుస్పష్టం. ఇకపోతే ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ ఏదేని సమస్యపై లేచి నిలబడితే మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదు. కనీసం విపక్షనేతకు గౌరవం ఇవ్వాలన్న ఆలోచన కూడా లేకుండా లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా వ్యవహరిస్తున్నారు. సమావేశాలను ప్రత్యక్షం గా వీక్షించే వారికి ఇది స్పష్టంగా కనిపిస్తుంది. ఒకవేళ రాహుల్ విపక్ష నేతగా సరిగా మాట్లాడకపోతే దానికి సమాధానం ఇవ్వడానికి ప్రభుత్వానికి అవకాశం ఉంటుంది. కానీ అసలు మైక్ ఇచ్చీ ఇవ్వనట్లుగా స్పీకర్ వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో స్పీకర్ ఓంబిర్లాపై అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టాల్సి వచ్చింది. ఇది కూడా మంచిదే. ఎలాగూ బలం ఉంది. స్పీకర పదవికి వచ్చిన ధోకా లేదు. కనీసంఈ సందర్భంగా అయినా పార్లమెంట్‌లో చర్చ సాగితే మంచిదే. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై విపక్ష ఎంపీలు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు మంగళవారంనాడు నోటీసులు ఇచ్చారు. నోటీసును లోక్‌సభ సెక్రటరీకి అందజేశారు. ఇండియా కూటమికి చెందిన 118 మంది ఎంపీలు అవిశ్వాస తీర్మానం నోటీసుపై సంతకాలు చేశారు. సభలో మాట్లాడేందుకు విపక్ష నేతలకు స్పీకర్ అవకాశం ఇవ్వడం లేదంటూ ఈ నోటీసు ఇచ్చారు. కాంగ్రెస్, సమాజ్‌వాదీ, డీఎంకే పార్టీలు దీనికి మద్దతు పలుకగా, తృణమూల్ కాంగ్రెస్ ఇంతవరకూ సంతకం చేయలేదు. ఈ పక్రియను సమీక్షించనున్నట్టు టీఎంసీ నేత అభిషేక్ బెనర్జీ తెలిపారు. అవిశ్వాస తీర్మానంపై రాహుల్ గాంధీ సంతకం చేయలేదని కాంగ్రెస్ పార్టీ వర్గాలు తెలిపాయి. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో స్పీకర్ తొలగింపు పిటిషన్‌పై ప్రతిపక్ష నేత సంతకం చేయడం సరైంది కాదని, రాహుల్ గాంధీ సంతకం చేయకపోవడానికి అదే కారణమని పేర్కొన్నాయి. కాగా, అవిశ్వాస తీర్మానం పరంగా లోక్‌సభలో బలాబలాలను చూసినప్పుడు లోక్‌సభలో అధికార పార్టీకి స్పష్టమైన మెజారిటీ ఉంది. 293 మందితో మెజారిటీ సభ్యుల బలం వారికి ఉండగా, విపక్షాలకు 214 మంది సభ్యుల బలం ఉంది. బలాల సంఖ్య ఎలా ఉన్నా విషయం మాత్రం ప్రజలకు కూడా తెలుస్తుంది. పార్లమెంట్ సమావేశాలు ఎన్ని రోజులు జరిగినా మొక్కుబడిగా మమ అనిపిస్తున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై చర్చ సాగడం లేదు. దేశంలో అవినీతి, అక్రమాలు, నిరుద్యోగం, ధరల పెరుగుదల వంటి అనేక సమస్యలు ఉన్నాయి. రాష్ట్రపతి ప్రసంగం, బడ్జెట్ సమావేశాల్లో ఈ అంశాలను చర్చకు అవకాశం ఉంటుంది. కానీ విపక్షాలకు అలాంటి అవకాశం రావడం లేదు. కేవలం ప్రధాని పడికట్టు పదాలతో ఇచ్చే ఉపన్యాసమే ప్రధాన వార్తగా చలామణి అవుతుంది. వికసిత భారత్, ఆత్మనిర్భర భారత్ వంటి పడికట్టు పదాలు తప్ప దేశం పురోగతికి సంబంధించి న అంశాలపై చర్చలకు ఆస్కారం కలగడం లేదు. మాజీ ఆర్మీచీఫ్ నరవాణె ఆముద్రిత పుస్తకంలోంచి కొన్ని పదాలను ఉటంకిస్తూ రాహుల్ మాట్లాడాలనుకున్న అవకాశం దక్కలేదు. ఒకవేళ ఆముద్రిత పుస్తకం ప్రస్తావన వద్దని చెప్పడం వేరు. కానీ అసలు మాట్లాడనీయక పోవడం సరికాదు. వాజ్‌పేయ్, పివి నరసింహారావు, రాజీవ్ గాంధీ, మన్మోహన్ సింగ్ ప్రధానులుగా ఉన్న సమయాల్లోనూ పార్లమెంటులో అర్థవంతమైన చర్చలు సాగేవి. కానీ ప్రస్తుతం చర్చలకు ఆస్కారం లేకపోవడంతో విపక్ష ఎంపిలు పోడియం వద్ద ఆందోళన చేయడం, సభనుంచి బయటకు రావడం రివాజుగా మారింది. ఇకపోతే లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఈ విషయంలో ఎందుకనో విపక్షం వైపు చూడడం మానేశారు. విపక్ష సభ్యుల ప్రస్తావనలకు స్పందించడం లేదు. ఇది ఆయన ఆత్మ పరిశీలన చేసుకోవాలి. అంతేకాదు...తన వైఖరిని మార్చుకుని ప్రజలకోసం పార్లమెంట్ అన్నది గుర్తించాలి. ఇకపోతే అవిశ్వాస తీర్మానంపై చర్చ పూర్తయ్యేంత వరకూ సభకు దూరంగా ఉండాలని ఓంబిర్లా నిర్ణయం తీసుకున్నారు. స్పీకర్‌ను తొలగించాలంటూ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు లోక్‌సభ సెక్రటరీకి కాంగ్రెస్ నోటీసు ఇచ్చిన నేపథ్యంలో ఓం బిర్లా ఈ నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో రాహుల్ గాంధీకి స్పీకర్ అవకాశం ఇవ్వలేదని, నిలదీసిన 8 మంది ఎంపీలపై సస్పెన్స్ వేటువేశారని విపక్షాలు తప్పుపడు తున్నాయి. విపక్షానికి చెందిన మహిళా ఎంపీలు దాడికి ప్రయత్నిస్తారనే సమాచారంతో ప్రధాని ప్రసంగం లేదని సభాపతి స్థానం నుంచి ఓం బిర్లా ప్రకటించడం, మహిళా ఎంపీలపై తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసిన బీజేపీ ఎంపీపై స్పీకర్ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడాన్ని విపక్షాలు విమర్శిస్తున్నాయి. ఈ క్రమంలో 118 మంది సభ్యుల సంతకాలతో మంగళవారం ఉదయం లోక్‌సభ సెక్రటరీ జనరల్‌కు విపక్షాలు అవిశ్వాస తీర్మానం నోటీసు అందజేశాయి. కాగా, దీనికిముందు అధికార పార్టీకి తలొగ్గి తమపై నిరాధారమైన ఆరోపణలు చేశారంటూ ఓం బిర్లాకు రాసిన లేఖలో కాంగ్రెస్ మహిళా ఎంపీలు నిరసన తెలిపారు. ఇవన్నీ ఎలా ఉన్నా పార్లమెంటులో చర్చలు జరగాలి. అర్థవంతమైన చర్చలకు ఆస్కారం ఉండాలి. స్పీకర్ అలాంటి అవకాశం కల్పించాలి. గతంలో పనిచేసిన స్పకీర్లు అనుసరించిన తీరును నడవాలి. అప్పుడే పార్లమెంట్ సమావేశాలకు అర్థం ఉంటుంది. అధికార బిజెపి కూడా ప్రజాస్వామ్యబద్దంగా పనిచేయడానికి సిద్దంగా ఉండాలి. గత పదేళ్లతో పోలిస్తే 2024 ఎన్నికల్లో బిజెపి బలం గణనీయంగా పడిపోయింది. ఇప్పుడు ఎన్‌డిఎ పక్షాల మద్దతుతో కొనసాగుతున్నామని గుర్తించాలి. ఇంకా మభ్య పెట్టే పనులతో ప్రజల్లో మరింత పలచన కాకుండా చూసుకుంటే మంచిది.

# తెలంగాణ ఉద్యమ త్యాగాలను కించపరచవద్దు

### కోర్టు వ్యాఖ్యలపై కప్పాటి పాండురంగా రెడ్డి తీవ్ర అభ్యంతరం



**హైదరాబాద్, -ఫిబ్రవరి 11(మహాప్రభ)**

తెలంగాణ స్వరాష్ట్ర సాధన కోసం పద్నాలుగేళ్ల పాటు సాగిన మహోన్నత పోరాటంలో తమ జీవితాలను అర్పించిన ఉద్యమకారుల త్యాగాలను తక్కువ చేసి చూపేలా వస్తున్న గౌరవనీయ హైకోర్టు వ్యాఖ్యలపై తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కప్పాటి పాండురంగా రెడ్డి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్యలు వేలాది మంది తెలంగాణ ఉద్యమకారుల మనోభావాలను తీవ్రంగా గాయపరిచాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

“ఇంటి స్థలం, పింఛను ఇవ్వడానికి మీరేమైనా స్వాతంత్ర్య సమరయోధులా?” అనే వ్యాఖ్య ఉద్యమకారుల త్యాగాలను కించపరచడమేనని పాండురంగా రెడ్డి పేర్కొన్నారు. 1969 నుంచి 2014 వరకు సాగిన తెలంగాణ ఉద్యమం ఆధిపత్య పరాయి పాలన నుంచి విముక్తి, ఆత్మగౌరవం మరియు సమాన హక్కుల కోసం జరిగిన చారిత్రక పోరాటమని ఆయన గుర్తు చేశారు. ప్రాణాలకు తెగించి పోరాడిన వారి త్యాగాలను “బిక్ష”గా చూడటం సమంజసం కాదని అన్నారు. ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు ఇచ్చే హామీలు కేవలం ఓట్ల కోసమే కాదని, అవి బాధ్యతాయుతమైన భరోసాలుగా పరిగణించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే తమ జీవితాలు మారుతాయని ఆశించడంలో తప్పేమీ లేదని, ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరడ ప్రతి ఉద్యమకారుడి రాజ్యాంగబద్ధమైన హక్కు అని స్పష్టం చేశారు.

“ప్రభుత్వం ఎంతమందికని ఇవ్వగలుగుతుంది?” అన్న ప్రశ్న తగదని ఆయన అభిప్రాయపడ్డారు. నీళ్లు, నిధులు, నియామకాలు అనే లక్ష్యాలతోనే ప్రత్యేక రాష్ట్రం సిద్ధించిందని పేర్కొన్నారు. ఉద్యమకారుల పోరాటం ఫలితంగానే నేడు రాష్ట్ర ఖజానాకు ఆదాయం వస్తోందని, వేల కోట్ల అభివృద్ధి కార్యక్రమాలు అమలవుతున్నాయని తెలిపారు. రాష్ట్ర నిర్మాణంలో మూలకారకులైన ఉద్యమకారుల సంక్షేమాన్ని చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. న్యాయస్థానాలు చట్టాలను గౌరవించడమే కాకుండా ప్రజల సెంటిమెంట్లు, చారిత్రక నేపథ్యాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఉద్యమకారులను కేవలం “లబ్ధిదారులు”గా చూడకుండా, ఈ రాష్ట్ర నిర్మాతలుగా గుర్తించాలని సూచించారు. ఉద్యమకారుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికి చేటు చేస్తాయని, తెలంగాణ సమాజం వాటిని సమర్థించదని స్పష్టం చేశారు. న్యాయస్థానాలు, న్యాయమూర్తులు మరియు న్యాయవాదులు తెలంగాణ ఉద్యమకారులకు అండగా నిలవాలని కప్పాటి పాండురంగా రెడ్డి కోరారు.

## ఓటు హక్కును వినియోగించుకున్న జిల్లా ఆదరణ ఎస్పీ మహేందర్.



**మెదక్ జిల్లా-11ఫిబ్రవరి (మహాప్రభ)**

ఈ రోజు జరుగుతున్న మున్సిపాలిటీ ఎన్నికల సందర్భంగా మెదక్ జిల్లా అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ మెదక్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో ఓటు హక్కు కీలక పాత్ర పోషిస్తుందని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. అదనపు ఎస్పీ మాట్లాడుతూ, ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా, ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఓటు అనేది ప్రజల చేతిలో ఉన్న శక్తివంతమైన ఆయుధమని, ఎన్నికల ప్రక్రియలో ప్రతి ఒక్కరి చురుకైన భాగస్వామ్యం ప్రజాస్వామ్యానికి పునాదిగా నిలుస్తుందని పేర్కొన్నారు. అలాగే, మెదక్ జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయని తెలిపారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు శాఖ పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసిందని వివరించారు. సీఐలు, డీఎస్పీల ఆధ్వర్యంలో స్ట్రైకింగ్ ఫోర్సులు, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్సులు విధులు నిర్వహిస్తూ ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నాయని చెప్పారు. అలాగే, రూట్ మొబైల్ బృందాలు నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తూ శాంతి భద్రతలను కట్టుదిట్టంగా పర్యవేక్షిస్తున్నాయని అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ తెలిపారు.

## ఆర్టీసీ వరంగల్ రీజియన్ లో మహాశివరాత్రికి ప్రత్యేక బస్సులు...!



**ఉమ్మడి వరంగల్, -ఫిబ్రవరి 11(మహాప్రభ)**

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని శైవ క్షేత్రాలకు మహాశివరాత్రి సందర్భంగా 235 ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ వరంగల్ రీజనల్ మేనేజర్ డి. విజయభాను తెలిపారు. ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకు బస్సులు నడపడం జరుగుతుందని పేర్కొన్నారు. వేములవాడకు 60 బస్సులు, కాళేశ్వరానికి 50 బస్సులు, రామప్పకు 15 బస్సులు ,పాలకుర్తి 25 బస్సులు, కురివికి 20 బస్సులు, అయినవోలు 25 బస్సులు, కొమరవెల్లికి 40 బస్సులు నడపడం జరుగుతుందని వివరించారు. మహాలక్ష్మి పథకం వర్తిస్తుందని తెలిపారు.

## మున్సిపల్ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్న జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ దంపతులు.



**మెదక్ జిల్లా- ఫిబ్రవరీ 11(మహాప్రభ)**

మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌లో భాగంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీ గాంధీనగర్ వార్డ్ నెంబర్ -18 పోలింగ్ స్టేషన్ నెంబర్ 35 వద్ద కలెక్టర్ దంపతులు సామాన్య ఓటరుల్లా వరుసలో నిలబడి ఓటు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత శక్తివంతమైనదని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఓటరు తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి ఓటరు పోలింగ్ కేంద్రానికి చేరుకుని నిర్భయంగా ఓటు వేయాలని, స్థానిక స్వపరిపాలనలో భాగస్వాములు కావాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా మున్సిపల్ పోలింగ్

మెదక్ మున్సిపాలిటీలో 100 శాతం ఓటింగ్ జరగాలి.

-సాధారణ పరిశీలకులు రవి కిరణ్

-మున్సిపల్ ఎన్నికల పోలింగ్ పక్రియ ప్రశాంతంగా జరుగుతున్నట్లు సాధారణ పరిశీలకులు రవి కిరణ్ స్పష్టం



**మెదక్ జిల్లా-ఫిబ్రవరి 11(మహాప్రభ)**

బుధవారం మెదక్ మున్సిపల్ పరిధిలో ఉన్న పలు వార్డులలో,పోలింగ్ కేంద్రాలలో విస్తృతంగా పర్యటించి పరిశీలించారు. పోలింగ్ సిబ్బందిని, పోలింగ్ కేంద్రానికి వచ్చిన ఓటర్లను ఓటింగ్ ఏర్పాట్లు ఎలా ఉన్నాయంటూ తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సాధారణ పరిశీలకులు రవి కిరణ్ మాట్లాడుతూ.. మెదక్ మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతున్నాయన్నారు. మెదక్ జిల్లా మున్సిపల్ ప్రజలు పెద్ద ఎత్తున ఓటింగ్ లో పాల్గొని మెదక్ మున్సిపాలిటీలో 100 శాతం ఓటింగ్ జరగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, మెదక్ ఆర్డీవో రమాదేవి,డి ఎస్ పి ప్రసన్న కుమార్, మెదక్ తహసిల్దార్ లక్ష్మణ్ బాబు ,ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

# అనాధ విద్యార్థులకు మూడు శాతం రిజర్వేషన్లు కల్పించాలి

**-తెలంగాణ అనాధ హక్కుల సంస్థ అధ్యక్షులు బొక్క వెంకటయ్య**
**-హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ బాలకృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేత**




**హైదరాబాద్,-ఫిబ్రవరి 11(మహాప్రభ)**
గత రెండు దశాబ్దాలుగా ప్రాణాలకు తెగించి, ప్రభుత్వంతో కొట్లాడి తాను తీసుకువచ్చిన అనాథలకు రాష్ట్రంలోని అన్ని విద్యా సంస్థలు, విశ్వ విద్యాలయాలలో 3 శాతం రిజర్వేషన్స్ జీవోను అమలు చేయాలని కోరుతూ బుధవారం తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ బాలకృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేసినట్లు తెలంగాణ అనాధ హక్కుల పరిరక్షణ సంస్థ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు, అనాధ హక్కుల పోరాట వేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొక్క వెంకటయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ అనాథ పిల్లలకు విద్యావకాశాలు, సంక్షేమ చర్యలు చేపట్టాలని అన్నారు. సమాజంలో ముఖ్యంగా బలహీన, వెనుకబడిన అనాథ విద్యార్థులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. వివిధ సంక్షేమ కార్యక్రమాలు ఉన్నప్పటికీ, ఆర్థిక మద్దతు, కుటుంబ మద్దతు, సామాజిక భద్రత లేకపోవడం వల్ల అనాథ విద్యార్థులు ఉన్నత విద్యను పొందడంలో గణనీయమైన అడ్డంకులను ఎదుర్కొంటున్నారని అన్నారు. సమ్మిళిత విద్యను ప్రోత్సహించడానికి, సమానత్వం, సామాజిక న్యాయ సూత్రాలను నిలబెట్టడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ను కోరినట్లు చెప్పారు. ఈ విషయాన్ని వీలైనంత త్వరగా పరిశీలించి, అన్ని విశ్వ విద్యాలయాలు, అనుబంధ సంస్థలకు తగిన విధాన చర్యలు, అవసరమైన సూచనలను ప్రారంభించాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. దీనిపై రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ, ప్రభుత్వ ఉన్నత విద్యా శాఖ, తెలంగాణ సెక్రటేరియట్, రాష్ట్ర కార్యదర్శి, మహిళా శిశు అభివృద్ధి, ఎస్సీ శాఖ, ప్రిన్సిపరల్ సెక్రటరీ, ప్రభుత్వ బిసి సంక్షేమ శాఖ, టిజి సెక్రటేరియట్, హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర సిఎం, రాష్ట్ర గవర్నర్ కు విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.

# దుంపలపల్లి పోలింగ్ సెంటర్లో వృద్ధురాళ్లకు వీల్ చైర్స్ కరువు



**దుబ్బాక - ఫిబ్రవరి 11 (మహాప్రభ)**
సిద్దిపేట జిల్లా దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలో దుంపలపల్లి జిల్లా పరిషత్ పాఠశాల పోలింగ్ సెంటర్ వద్దకు ఓటు హక్కును వినియోగించుకునేందుకు వృద్ధులు, వికలాంగులకు వీల్ చైర్స్ కరువు ఆయను మున్సిపల్ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని దుంపలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పోలింగ్ సెంటర్ వద్దకు ఓటు హక్కును వినియోగించుకునేందుకు వృద్ధులు, వికలాంగులకు వీల్ చైర్స్ 50 మీటర్ల దూరంలో పెట్టడంతో కర్ర సహాయంతో పాఠశాల గేటు నుంచి 50 మీటర్ల దూరం నడుస్తూ అవస్థలు పడుతున్న ఓటు హక్కును వినియోగించుకున్నారు. బుధవారం జరుగుతున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో భాగంగా దుంపలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వృద్ధులకు సరైన సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు పడాల్సిన అవసరం వస్తుంది. అధికారుల నిర్లక్ష్యంతో వికలాంగులకు ఏర్పాటు చేయాల్సిన వీల్ చైర్స్ సెంటర్ ఎంట్రన్స్ లో పెట్టకుండా ఎంట్రన్స్ నుండి 50 మీటర్ల దూరంలో పెట్టడంతో వృద్ధులు అవస్థలు పడుతున్నారు.

# మెడిపల్లిలో సిఎస్ ఆర్ డెవలపర్స్ కొత్త బ్రాంచ్ ప్రారంభం



**మేడ్చల్ మల్కాజిగిరి/మేడిపల్లి: -ఫిబ్రవరి 11(మహాప్రభ)**
ఫిబ్రవరి 11, నాణ్యత, నమ్మకం, పారదర్శకతకు చిరునామాగా నిలుస్తున్న సి ఎస్ ఆర్ డెవలపర్స్ మరో ముఖ్యమైన మైలురాయిని అధిగమించింది. మెడిపల్లి, ఎస్వీఎం గ్రాండ్ హోటల్ ఎదురుగా సంస్థ నూతన బ్రాంచ్ కార్యాలయాన్ని ఘనంగా ప్రారంభించింది. నూతన కార్యాలయ ప్రారంభోత్సవం సంప్రదాయ పూజలతో నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో సి ఎస్ ఆర్ డెవలపర్స్ డైరెక్టర్లు రెడ్యా నాయక్,రేగు భాస్కర్, పాల్గొని సంస్థ భవిష్యత్ విస్తరణ ప్రణాళికలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మెడిపల్లి బ్రాంచ్ ద్వారా హైదరాబాద్ తూర్పు ప్రాంత ప్రజలకు నాణ్యమైన నివాస ప్లాట్లు, భద్రమైన పెట్టుబడి అవకాశాలు అందించడమే కాకుండా, కస్టమర్లకు అవసరమైన అన్ని రియల్ ఎస్టేట్ సేవలను ఒకే చోట అందించనున్నట్లు తెలిపారు. సైట్ విజిట్లు, ప్రాజెక్ట్ సమాచారం, స్పష్టమైన డాక్యుమెంటేషన్ ద్వారా కస్టమర్‌కు పూర్తి నమ్మకం కలిగించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.మెడిపల్లి బ్రాంచ్ ప్రారంభంతో మరింత విస్తృత సేవలు అందించనున్నట్లు సంస్థ వర్గాలు తెలిపాయి.

# నెట్టెంపాడు గ్రామంలో శివ లతో భక్తి వాతావరణం వెల్లివిరిసింది



**జోగులాంబ గద్వాల జిల్లా -ఫిబ్రవరి 11(మహాప్రభ)**
నెట్టెంపాడు గ్రామానికి చెందిన శివ మాల భక్తులు 41 రోజుల పాటు శివమాల దీక్షను నియమ నిష్ఠలతో, భక్తి శ్రద్ధలతో పూర్తి చేసుకొని ఈ రోజు పవిత్ర క్షేత్రమైన శ్రీశైలం వైపు ఇరుమూడితో బయలుదేరారు. దీక్ష కాలమంతా భక్తులు నిత్య పూజలు, భజనలు, శివనామస్మరణతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పారు. కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు వారికి ఆశీర్వాదాలు అందజేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.శ్రీశైలం మల్లికార్జున స్వామి భ్రమరాంబ దేవి దర్శనం ద్వారా గ్రామానికి శాంతి, సౌభాగ్యం, అభివృద్ధి కలగాలని వారు కోరుకుంటున్నారు. ఈ పవిత్ర యాత్ర విజయవంతంగా పూర్తయ్యి, స్వామి వారి కృపా కటాక్షాలు అందరిపై ఉండాలని మనసారా ప్రార్థిశీచిరారు.ఊరంతా శివనామ స్మరణ తో మారుమోగింది భజన,డోళ్లు మధ్యన శివలను శ్రీశైలం కు పంపడం జరిగింది.

# గజ్వేల్ లో ఓటు హక్కును వినియోగించుకున్న

**భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు**



**దుబ్బాక - ఫిబ్రవరి 11 (మహాప్రభ)**
మున్సిపల్ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నరు, సిద్దిపేట జిల్లా గజ్వేల్ కి చెందిన భక్తరత్న జాతీయ అవార్డు గ్రహీత, శ్రీరామ కోటి భక్త సమాజం ధార్మిక సేవా సంస్థ వ్యవస్థాపక, అధ్యక్షులు రామకోటి పుప్ప దంపతులు, ఓటు వేసి ఈ సందర్భంగా మాట్లాడుతూ భారత రాజ్యాంగం మనకు కల్పించిన ఓటు హక్కు ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలన్నారు. మన ఓటుతో ఒక మంచి నాయకున్ని ఎన్నుకోవాలి అన్నారు. నీతిగా ఓటు వేసి రామ రాజ్యాన్ని స్థాపించాలన్నారు. ఓటే వజ్రాయుధం అన్నారు. అవినీతి మరుపులను ఓటుతోనే కొట్టాలన్నారు.

# ఆన్లైన్ గేమ్ కు యువకుడు బలి..!



**గోదావరిఖని:-ఫిబ్రవరి 11(మహాప్రభ)**
గోదావరిఖని విట్టల్ నగర్ కు చెందిన తుండ్ల రోహిత్(25) గతంలో ఆన్లైన్ గేమ్స్ కి అలవాటు పడి అప్పులపాలై తన తల్లిని అప్పులు తీర్చేందుకు డబ్బులు కావాలని అడగగా ఆమె దాదాపు 5లక్షల రూపాయల వరకు మృతునికి ఇచ్చింది. గతంలో రెండు మూడు సార్లు అప్పులు ఎక్కువగా ఉన్నాయి నేను చనిపోతాను అని ఫిర్యాదిని మృతుడు బెదిరించాడని అన్నారు. నిన్న రాత్రి బేకరీ పనులు పూర్తి చేసుకుని తిరిగి ఇంటికి వచ్చిన మృతుడు రాత్రి సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్య చేసుకొని చనిపోయినాడు. బుధవారం తెల్లవారుజామున ఫిర్యాది తన ఇంటికి తిరిగి వచ్చి ఇంటి తలుపులు కొట్టగా మృతుడు తలుపులు తెరవకపోయేసరికి ఫిర్యాది తన ఇంటి ప్రక్కవారి సహాయంతో తలుపులు తెరిచి చూడగా మృతుడు ఉరికి వేలాడుతూ చనిపోయి ఉన్నాడని, మృతుని తల్లి ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ కె. సంజీవయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పోలింగ్ కేంద్రాలలో పోలీసుల మానవీయతకు సలామ్..!

**-ప్రజలతో మమేకమై ఓటర్లకు సహాయం...**



**గోదావరిఖని:-ఫిబ్రవరి 11(మహాప్రభ)**
రామగుండం కార్పొరేషన్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం విధులు నిర్వహించిన పోలీసుల మానవీయత ప్రశంసనీయంగా నిలిచింది. పోలింగ్ కేంద్రాలకు వచ్చిన వృద్ధులు, మహిళలు, ప్రత్యేక అవసరాలున్న ఓటర్లకు పోలీసులు సహాయం అందించారు. పోలింగ్ కేంద్రాల్లో భద్రతతో పాటు ఓటర్లకు అవసరమైన మార్గనిర్దేశం, భరోసా కల్పిస్తూ చేయూతనందించి వారు సురక్షితంగా ఓటు వినియోగించకునేందుకు పూర్తి సహకారం అందించారు. పోలీసులు ప్రజలతో మమేకమయ్యారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా శాంతియుత వాతావరణంలో పోలింగ్ కొనసాగేందుకు పోలీస్ శాఖ కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలనే లక్ష్యంతో పోలీసులు నిరంతరం విధులు నిర్వర్తిస్తూ మానవత్వం ప్రదర్శించారు.

# తడ జాతీయ రహదారిపై ప్రమాదం

**ఓవర్ స్పీడ్ తో అదుపు తప్పి డివైడర్‌పైకి దూసుకెళ్లిన ట్రాక్టర్**



**ఫిబ్రవరి 11 (తడ) మహాప్రభ.**
తిరుపతి జిల్లా తడ మండలంలో నిప్పో ఫ్యాక్టరీ ఎదురుగా జాతీయ రహదారిపై బుధవారం ప్రమాదం చోటుచేసుకుంది. చెన్నై వైపు వెళ్తున్న ఓ ట్రాక్టర్ అధిక లోడుతో అతివేగంగా ప్రయాణిస్తుండగా డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో డివైడర్‌పైకి ఎక్కింది. ప్రమాదం జరిగిన సమయంలో రహదారిపై ఇతర వాహనాలు తక్కువగా ఉండటంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఘటనతో కొంతసేపు రహదారిపై వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న తడ ఎస్సై కొండప నాయుడు, పోలీసు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్ ను పునరుద్ధరించి,కేసు నమోదు చేశారు.

# ప్రజలకు నీటి సౌకర్యం కల్పించిన సర్పంచ్ దేశపాగ నరసింహ




**మహేశ్వరం, -ఫిబ్రవరి 11(మహాప్రభ)**
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండల కేంద్రంలోని నందుపల్లి గ్రామంలో సర్పంచ్ దేశపాగ నరసింహ ప్రజల సమస్యను పరిష్కరించారు. ఎన్నో సంవత్సరాలుగా సమాధుల వద్ద నీటి సౌకర్యం లేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని గమనించిన ఆయన, చెరువు ఎండిపోయే కాలంలో సమస్య మరింత తీవ్రమవుతుందని గుర్తించారు.గ్రామపంచాయతీ నర్సరీ పక్కనే సమాధులు ఉండటంతో, ఒకే బోరు ద్వారా నర్సరీకి, సమాధులకు నీటి సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకున్నారు. ఈ నిర్ణయం గ్రామ ప్రజలకు ఉపశమనం కలిగించింది.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ షేక్ ఎజాస్, దేశపాగ లింగి సంతు, కల్వకోల్ మహేందర్, రంగుల రవి, దేశపాగ రమేష్, ఇందిరమ్మ కమిటీ మెంబర్ కాశగోని జగదీష్ గౌడ్, కమిటీ అధ్యక్షుడు షేక్ షరీఫ్, రేషన్ డీలర్ ఎండి అలీపాష, గోరి చంద్రయ్య, కర్రే సత్తయ్య, ఆకన్‌పల్లి అశోక్, షేక్ ఖలీల్, రంగుల శ్రవణ్, పంచాయతీ కార్యదర్శి జానయ్యతో పాటు గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.గ్రామస్తులు సర్పంచ్ నరసింహ తీసుకున్న ఈ నిర్ణయాన్ని అభినందిస్తూ, సమాధుల వద్ద నీటి సౌకర్యం కల్పించడం ఎంతో అవసరమైన పని అని ప్రశంసించారు.

# కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య ప్రశాంతంగా పోలింగ్

- ఫ్యూచర్ సిటీ కమిషనర్ సుధీర్ బాబు పరిశీలన



**రంగారెడ్డి, -ఫిబ్రవరి 11(మహాప్రభ)**
ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలో మున్సిపల్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో కొనసాగుతున్నాయని పోలీస్ కమిషనర్ జి. సుధీర్ బాబు, ఐపీఎస్ తెలిపారు.చేవెళ్ల పట్టణ కేంద్రంలోని 16, 17, 18 పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించి, అధికారులతో మాట్లాడి సూచనలు, సలహాలు ఇచ్చారు. మధ్యాహ్నం 1 గంట వరకు 55 శాతం పోలింగ్ నమోదైందని, సాయంత్రం 5 గంటల వరకు కొనసాగనున్న పోలింగ్‌లో సుమారు 80 శాతం వరకు నమోదవుతుందని అంచనా వేశారు.
మహిళా ఓటర్లు ఉత్సాహంగా పోలింగ్ కేంద్రాలకు తరలివస్తున్నారని, వారికి ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టామని తెలిపారు. సమస్యాత్మక కేంద్రాలను ముందుగానే గుర్తించి అక్కడ కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.ఈ జోన్‌లో 500 మంది పోలీసు సిబ్బందిని మోహరించామని, కమిషనరేట్ పరిధిలో 38 రూట్లలో పర్యవేక్షణ, పహారా కొనసాగుతోందని చెప్పారు. చేవెళ్ల జోన్ పరిధిలోని మూడు మున్సిపాలిటీలలో ఎన్నికలు జరుగుతున్నాయని, పోలింగ్ అనంతరం బ్యాలట్ బాక్సులను స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరచి ఎల్లుండి కౌంటింగ్ నిర్వహిస్తామని కమిషనర్ సుధీర్ బాబు వివరించారు.

# ప్రతీ ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి

- నల్లమోతు భాస్కర్ రావు



**మిర్యాలగూడ, -ఫిబ్రవరి 11(మహాప్రభ)**
భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతీ ఒక్కరూ వినియోగించుకోవాలని మిర్యాలగూడ పట్టణ ప్రజలను మాజీ శాసనసభ్యులు నల్లమోతు భాస్కర్ రావు కోరారు.రాష్ట్రవ్యాప్తంగా బుధవారం జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ఆయన కుటుంబ సభ్యులతో కలిసి బాపూజీ నగర్‌లోని వడ్డెర సంఘం భవనంలో తమ ఓటు హక్కును వినియోగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, "మిర్యాలగూడ పట్టణ ప్రగతి నిరాటంకంగా కొనసాగాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి. ఓటింగ్ శాతం పెరగాలి" అని సూచించారు.భాస్కర్ రావు మాట్లాడుతూ, "భారత రాజ్యాంగం కల్పించిన హక్కుల సాధన ఓటు అనే వజ్రాయుధంతోనే సాధ్యం. ప్రజాస్వామ్య బలానికి ఓటు హక్కు మూలస్తంభం. అందువల్ల ప్రతి ఒక్కరూ పోలింగ్ కేంద్రాలకు తరలిరావాలి" అని విజ్ఞప్తి చేశారు.

# ఓటు ఎవరో వేశారు...
# నా హక్కు దోచేశారు

**తొలి సారి ఓటు వేద్దాం అనుకుంటే చేదు అనుభవం**



**షాద్‌నగర్, -ఫిబ్రవరి 11(మహాప్రభ)**
ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రతి పౌరుడికి అత్యంత విలువైన హక్కు. అయితే అదే హక్కు తనకుండగానే దోచుకుపోయారని ఒక యువ ఓటరు ఆవేదన వ్యక్తం చేసిన ఘటన మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా వెలుగులోకి వచ్చింది.8వ వార్డుకు చెందిన బోడం పాటి చందన తొలిసారిగా ఓటు వేయాలని ఉత్సాహంగా పోలింగ్ కేంద్రానికి చేరుకున్నారు. ప్రజాస్వామ్య పండుగలో భాగమవ్వాలనే ఆనందంతో బూత్‌లోకి వెళ్లి తన పేరు చెక్ చేయగా, అధికారులు "మీ ఓటు ఇప్పటికే నమోదైంది" అని చెప్పడంతో ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురయ్యారు.'నాకున్న ఒక్క ఓటు హక్కు ఇలా దోచుకుంటే ఎలా? నేను వేయకుండానే ఎలా నమోదవుతుంది?" అంటూ చందన ప్రశ్నించారు. తొలిసారి ఓటు వేయాలనే ఆశతో వచ్చిన తనకు ఇలా జరగడం బాధాకరమని కన్నీటి పర్యంతమయ్యారు.ఈ ఘటనతో పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతా లోపాలపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఓటర్ల వివరాల ధృవీకరణలో నిర్లక్ష్యం కారణమా? లేక బోగస్ ఓటింగ్ జరిగిందా? అనే అనుమానాలు తలెత్తుతున్నాయి.సంబంధిత అధికారులు దీనిపై స్పష్టత ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఒక్క ఓటు కూడా అమూల్యం. అలాంటి హక్కు దుర్వినియోగం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఓటర్లు డిమాండ్ చేస్తున్నారు."ఓటు హక్కు రక్షణే నిజమైన ప్రజాస్వామ్యానికి బలం. అలాంటి ఓటు హక్కు చోరీకి గురైతే ఎలా?" అంటూ అధికారులు వెంటనే విచారణ చేపట్టి న్యాయం చేయాలని చందన కోరారు.

# ఫిబ్రవరి 12న చేపట్టనున్న దేశవ్యాప్త
# సమ్మెను విజయవంతం చేద్దాం




**ఆమనగల్లు, -ఫిబ్రవరి 11(మహాప్రభ)**
లేబర్ కోడ్స్ వీబీ - రామ్ జీ చట్టం జాతీయ విత్తన విద్యుత్ సవరణ బిల్లులను రద్దు చేయాలని 1996 కేంద్ర చట్టం రక్షణ కోసం చర్యలు తీసుకోవాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు మహమ్మద్ జహంగీర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం పట్టణ కేంద్రంలోని బాపూజీ తాపీ మేస్త్రీ ల సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సమ్మె కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కన్ స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ ఉపాధ్యక్షులు సుంకర రామ్మోహన్ రావు హాజరవుతారని తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్ లను రద్దు చేయాలి. బీవీ జీ రామ్ జీ బిల్లును రద్దు చేసి, పథకాన్ని యదావిధంగా కొనసాగించాలి.విత్తన, విద్యుత్ చట్టాల సవరణను ఉపసంహరించుకోవాలి. ఇన్సూరెన్స్ రంగంలో 100% విదేశీ పెట్టుబడులను ఉపసంహరించుకోవాలి. భవన నిర్మాణ కేంద్ర చట్టం-1996, అంతర్రాష్ట్ర వలస కార్మికుల చట్టం-1979 లను కాంట్రాక్ట్ కార్మికుల చట్టం-1970 లను పకడ్బందీగా అమలు చేయాలి. కార్మికులందరికీ కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి. కార్మిక సంఘాల ప్రతినిధులతో వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ కమిటీని నియమించాలి బోర్డు నిధులు దుబారా కాకుండా కార్మికుల సంక్షేమం కోసమే ఖర్చు చేయాలి. ప్రమాద మరణానికి రూ.10 లక్షలు,సహజ మరణానికి రూ.5 లక్షలు, దహన సంస్కారాల ఖర్చు, ప్రసూతి, వివాహ కానుకలను రూ.లక్షకు పెంచాలి. కనీస పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలి, కేంద్ర చట్టంలోని స్కాలర్ షిప్ , గృహవసతి, అడ్డాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలి 2009లో నమోదు చేసుకున్న కార్మికుల కార్డులు వెంటనే రెన్యువల్ చేయాలి. ఈశ్రమ్ గుర్తింపు కార్డులను భవన నిర్మాణ కార్మికులందరికీ అందజేయాలి. కార్మికులకు అవసరం లేని సిఎస్సి హెల్త్ టెస్టులను రద్దు చేయాలి. 96 కేంద్ర చట్టం నిబంధనలకు విరుద్ధంగా ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇచ్చిన రూ.346 కోట్ల నిధులను తిరిగి వెల్ఫేర్ బోర్డులో జమ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మండల గౌరవ అధ్యక్షులు గంగిశెట్టి సురేందర్, ముఖ్య సలహాదారి ముక్కరి కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

# సృజనా సాధు సాధించిన ఈ విశిష్ట విజయాలు
# తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణం

**ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి.**



**ఎల్బీనగర్, -ఫిబ్రవరి 11(మహాప్రభ)**
నాగోలు డివిజన్ పరిధిలోని శ్రీ వెంకటరమణ కాలనీ నందు నివాసం ఉండే నాగరాజ్ సాధు మరియు గౌరి సాధు దంపతుల కుమార్తె సృజనా సాధు 2026 సంవత్సరానికి సంబంధించిన ప్రతిష్ఠాత్మక ఎన్‌సిసి రిపబ్లిక్ డే క్యాంప్ ను విజయవంతంగా పూర్తి చేశారు.ఆమె ప్రస్తుతం కేఎల్ యూనివర్సిటీలో బీ.టెక్ ద్వితీయ సంవత్సరం చదువుతూ,వన్ తెలంగాణ బెటాలియన్ ఎన్.సి.సి.నుంచి తెలంగాణ రాష్ట్రాన్ని ప్రాతినిధ్యం వహించారు.ఈ క్యాంప్ సందర్భంగా ఆమెకు అత్యంత ప్రతిష్ఠాత్మకమైన డైరెక్టరేట్ జనరల్ కమండేషన్ అవార్డు లభించింది.ఈ అవార్డు ఏ.పీ.మరియు తెలంగాణ డైరెక్టరేట్ మొత్తంలో కేవలం ముగ్గురు సభ్యులకే అందించబడటం విశేషం.ఇది ఆమె సాధించిన అత్యున్నత గౌరవానికి నిదర్శనం.అదనంగా ఆమెకు మాస్టర్ ఆఫ్ సెరిమనీస్ మెడల్ లభించగా, ఆమె ఆల్ ఇండియా మాస్టర్ ఆఫ్ సెరిమనీస్గా ఎంపికై,జాతీయ స్థాయిలో తన ప్రతిభను చాటారు.అలాగే రిపబ్లిక్ డే క్యాంప్‌లో భాగంగా ఆమె రాష్ట్రపతి భవన్ ను సందర్శించి,భారత రాష్ట్రపతి,ఉపరాష్ట్రపతి,ప్రధాన మంత్రి,రక్షణ మంత్రి,వాయుసేన అధిపతి,సేనాధిపతి,నౌకాదళ అధిపతి,అలాగే దిల్లీ ముఖ్యమంత్రిలను కలుసుకోవడం ఆమెకు గర్వకారణంగా నిలిచింది.క్యాంప్ ముగింపు సందర్భంగా ఆమెకు లభించిన అవార్డులను తెలంగాణ రాష్ట్ర గౌరవనీయ గవర్నర్ శ్రీ జిష్ణు దేవ్ వర్మ గారు స్వయంగా ప్రదానం చేశారు.దానిలో బాగంగా ఈ రోజు వారు ఎల్.బి.నగర్ శాసనసభ్యులు శ్రీ.దేవిరెడ్డి సుధీర్ రెడ్డి గారిని వారి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.సుధీర్ రెడ్డి గారు వారిని శాలువతో సన్మానించారు.అనంతరం సుధీర్ రెడ్డి గారు మాట్లాడుతూ సృజనా సాధు సాధించిన ఈ విశిష్ట విజయాలు కుటుంబ సభ్యులకు,విద్యాసంస్థకు మాత్రమే కాకుండా తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణంగా నిలిచాయి.రాబోయే రోజుల్లో మరిన్ని విజయాలు అందుకోవాలని ఆనందం వ్యక్తం చేశారు.ఇట్టి కార్యక్రమంలో భారస పార్టీ సీనియర్ నాయకులు చెరుకు ప్రశాంత్ గౌడ్,సతీశ్ యాదవ్ గార్లు పాల్గొన్నారు.

# శ్రీశైలంలో గూడూరు భక్తుల అన్నదానంకొనసాగింపు.



**గూడూరు -ఫిబ్రవరి 11(మహాప్రభ)**
గూడూరుశ్రీశైలంలో శ్రీ భ్రమరాంక మల్లికార్జున స్వాములదర్శనానికి వెళ్లిన భక్తులకు గూడూరు నీలకంఠేశ్వర స్వామి భక్త బృందం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసింది. మూడు రోజులుగా కొనసాగు తున్న అన్నదాన కార్యక్రమానికి గురువారం భారీగా భక్తులు పాల్గొని అన్న ప్రసాదాలను స్వీకరించినట్లు భక్త బృందం పేర్కొంది. పతియట భక్తాదుల కోసం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# బిజినెస్

# తగ్గిన బంగారం వెండి ధరలు.. ఎంతంటే ??

ఈ మధ్య కాలంలో బంగారం ధరలు ఎన్నడూ లేనంతగా విపరీతంగా పెరిగాయి. గతేడాది నుండి చూస్తే బంగారం ధరలు పెరగడమే కాని తగ్గడం జరగలేదు. ఏకంగా 10 గ్రాములు రెండు లక్షల రూపాయల వరకు చేరుకునే పరిస్థితి కనిపించింది. జనవరి నెలలో చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో ధరలు నింగిని తాకాయి. ఫిబ్రవరి నెల వచ్చేసరికి కాస్త తగ్గుముఖం పట్టినా పసిడి పెరుగుదల మాత్రం అలాగే కంటిన్యూ అవుతోంది. భవిష్యత్తులో కూడా బంగారం ధరలు భారీగా పెరుగుతాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే పసిడి పేరు వింటేనే సామాన్యుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. అయితే ఈ రోజు ఫిబ్రవరి 11 బుధవారం ధరలు కాస్త తగ్గుముఖం పట్టి పసిడి ప్రియులకు ఊరటనిచ్చాయి. 24 క్యారట్ల బంగారంపై రూ.270లు తగ్గి రూ.1,58,510లు పలుకుతోంది. 22 క్యారెట్ల బంగారంపై రూ.250లు తగ్గి రూ.1,45,300లుగా ఉంది. వెండి ధర మాత్రం స్థిరంగా కొనసాగుతోంది. బుధవారం కిలో వెండి ధర



రూ.3,00,000లుగా ఉంది. దేశంలోని వివిధ నగరాల్లో బుధవారం బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయంటే.. ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,58,660 దగ్గర ట్రేడవుతోంది. అలాగే 22 క్యారట్ల బంగారం ధర రూ.1,45,450 పలుకుతోంది. ముంబై, కోల్‌కతాలో 24 క్యారెట్ల బంగారం రూ.1,58,510 ఉంటే, 22 క్యారెట్ల బంగారం రూ.1,45,300 పలుకుతోంది. చెన్నైలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,59,280 ఉంటే, 22 క్యారెట్ల బంగారం ధర రూ. రూ.1,46,000 గా ఉంది. తెలుగు రాష్ట్రాల్లోని హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,58,510 ఉంటే, 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,45,300లు పలుకుతోంది. కిలో వెండి ధర రూ.3,00,000లుగా కొనసాగుతోంది. ఈ ధరలు పెరగవచ్చు, తగ్గవచ్చు.. బంగారం కొనడానికి వెళ్లేముందు ధరలు మరోసారి చెక్‌చేసుకొని వెళ్తే మంచిది.

## అపోలో చేతికి బెంగళూరు హాస్పిటల్

### డీల్ విలువ రూ.165 కోట్లు

Apollo HOSPITALS TOUCHING LIVES

అపోలో హాస్పిటల్స్ తన వ్యాపార సామ్రాజ్యాన్ని మరింత విస్తరిస్తోంది. ఇందులో భాగంగా బెంగళూ రు కేంద్రంగా పని చేసే బెలినెస్ ఛాంపియన్ హాస్పిటల్స్ ప్రైవేట్ లిమిటెడ్‌ను అపోలో అనుబంధ సంస్థ ఇంపీరియర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్ లిమిటెడ్ (ఐహెచ్‌ఆర్‌సీఎల్) కొనుగోలు చేసింది. ఆస్తు లు, అప్పులతో కలిపి మొత్తం డీల్ విలువ రూ.165 కోట్లు. ప్రస్తుతం 125 పడకలతో పనిచేస్తున్న ఈ హాస్పిటల్‌ను ఈ ఏడాది జూన్‌కల్లా 175 పడకల హాస్పిటల్‌గా తీర్చిదిద్దనున్నట్టు అపోలో హాస్పిటల్స్ తెలిపింది.

క్యూ3 లాభం రూ.502 కోట్లు: అపోలో హాస్పిటల్స్ డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికంలో అనుబంధ కంపెనీలతో కలిసి (కన్సాలిడేటెడ్) రూ.6,477.4 కోట్ల ఆదాయంపై రూ.502 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే కంపెనీ ఆదాయం 17%, నికరలాభం 35% పెరిగాయి. వాటాదారులకు ఒక్కో షేరుపై రూ.10 మధ్యంతర డివిడెండ్ చెల్లించాలని కంపెనీ బోర్డు సిఫారసు చేసింది. ఇందుకు ఈ నెల 16వ తేదీని రికార్డ్ తేదీగా నిర్ణయించింది.

## వరుస లాభాలకు బ్రేక్..
## దేశీయ సూచీలకు స్వల్ప నష్టాలు..

వరుసగా లాభాలు ఆర్జించిన దేశీయ సూచీలు బుధవారం ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నాయి. లాభనష్టాలతో దోబూచులాడుతున్నాయి. గరిష్ఠాల వద్ద మదుపర్లు లాభాల స్వీకరణకు దిగడమే దీనికి కారణంగా కనిపిస్తోంది. మరోవైపు అమెరికా-బంగ్లాదేశ్ మధ్య కుదిరిన ట్రేడ్ భారత వస్త్ర రంగానికి సవాలు విసురుతుందనే అంచనాలు కూడా మదుపర్లలో భయాన్ని పెంచుతున్నాయి. అంతర్జాతీయంగా ప్రతికూల సంకేతాలు కూడా మార్కెట్‌పై నెగిటివ్ ప్రభావాన్ని చూపుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం సెన్సెక్స్, నిఫ్టీ స్వల్ప నష్టాల్లో కదలాడుతున్నాయి.గత సెషన్ ముగింపు (84,273)తో పోల్చుకుంటే బుధవారం ఉదయం





దాదాపు 70 పాయింట్ల లాభంతో మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత మరో 150 పాయింట్లు పైకి వెళ్లింది. అయితే మదుపర్లు అమ్మకాలకు మొగ్గు చూపడంతో ఆరంభ లాభాలు ఆవిరయ్యాయి. ప్రస్తుతం ఉదయం 10:00 గంటల సమయంలో సెన్సెక్స్ 43 పాయింట్ల లాభంతో 84,230 వద్ద కొనసాగుతోంది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడుతోంది. ప్రస్తుతం 8 పాయింట్ల లాభంతో 25,927 వద్ద కదలాడుతోంది .సెన్సెక్స్‌లో మహీంద్రా అండ్ మహీంద్రా, మారుతీ సుజికీ, టైటాన్ కంపెనీ, ఎస్బీఐ, టాటా స్టీల్ మొదలైన షేర్లు లాభాల్లో ఉన్నాయి . హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ట్రెంట్, టీసీఎస్, భారతీ ఎయిర్‌టెల్, లార్సన్ మొదలైన షేర్లు నష్టాల బాటలో సాగుతున్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 143 పాయింట్ల నష్టంతో ఉంది. బ్యాంక్ నిఫ్టీ 53 పాయింట్ల నష్టంతో ఉంది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 90.53గా ఉంది.

# టీ20 వరల్డ్‌కప్‌లో సూపర్ థ్రిల్లర్..

# స్పోర్ట్స్

### రెండో సూపర్ ఓవర్‌లో నెగ్గిన దక్షిణాఫ్రికా

అహ్మదాబాద్:
టీ20 వరల్డ్‌కప్‌లో ఆఫ్ఘనిస్తాన్, దక్షిణాఫ్రికా మధ్య జరిగిన మ్యాచ్‌లో హైడ్రామా చోటుచేసుకున్నది. సూపర్ థ్రిల్లింగ్‌గా సాగిన ఈ మ్యాచ్‌లో రెండు సార్లు సూపర్ ఓవర్ వరకు వెళ్లింది. చివరకు దక్షిణాఫ్రికా రెండో సూపర్ ఓవర్‌లో 4 రన్స్ తేడాతో విక్టరీ నమోదు చేసింది. ఈ వరల్డ్‌కప్‌లో సూపర్ ఓవర్ వరకు వెళ్లిన తొలి మ్యాచ్ ఇదే. భారీ పవర్ హిట్టర్లు ఉన్న రెండు జట్లు.. మ్యాచ్‌పై చివరి వరకు తమ పట్టును కోల్పోలేదు. ఈ మ్యాచ్‌లో సిక్సర్ల వర్షం కురిసింది. ఫస్ట్ మ్యాచ్‌లో రెండు జట్లు కలిపి 20 సిక్సర్లు కొట్టాయి. ఇక సూపర్ ఓవర్స్‌లో మరో 10 సిక్సర్లు బాదాయి. అహ్మదాబాద్ స్టేడియం బౌండరీల



మోతతో హోరెత్తింది.ఫస్ట్ బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా నిర్ణీత ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 187 రన్స్ చేసింది. క్వింటెన్ డికాక్ 59, రికల్టన్ 61 రన్స్ చేశారు. అయితే చేజింగ్ మొదలుపెట్టిన ఆఫ్ఘనిస్తాన్‌కు గుర్బాజ్ మంచి స్టార్ట్ ఇచ్చాడు. అతను 42 బంతుల్లో 84 రన్స్ చేశాడు. అజ్మతుల్లా, రషీద్ ఖాన్ కూడా చెలరేగిపోయారు. దీంతో మ్యాచ్ ఆఫ్ఘన్ గెలుస్తుందనుకున్నారు. కానీ ఆఖరి ఓవర్లో 13 రన్స్ అవసరం కాగా .. మ్యాచ్ టై అయ్యింది. 19.4 ఓవర్లలో 187 రన్స్ చేసి ఆఫ్ఘనిస్తాన్ ఆలౌటైంది. మ్యాచ్ టై కావడంతో సూపర్ ఓవర్‌కు వెళ్లింది. ఇక ఫస్ట్ సూపర్ ఓవర్‌లో ముందుగా ఆఫ్ఘనిస్తాన్ బ్యాటింగ్ చేసింది. ఆ ఓవర్‌లో 17 రన్స్ చేసింది ఆఫ్ఘనిస్తాన్. అజ్మతుల్లా 5 బంతుల్లో 16 రన్స్ చేశాడు. అయితే ఆ టార్గెట్‌ను అనూహ్య రీతిలో ఛేజ్ చేసింది దక్షిణాఫ్రికా. ఆఖరి బంతికి భారీ సిక్సర్ కొట్టిన స్టబ్స్ ఫస్ట్ సూపర్ ఓవర్‌ను తమ ఖాతాలో వేసుకున్నాడు. రెండో సూపర్ ఓవర్‌లో ఫస్ట్ బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా 23 రన్స్ చేసింది. స్టబ్స్ ఓ సిక్సర్ బాదగా, మిల్లర్ రెండు భారీ సిక్సర్లు కొట్టేశాడు. ఇక చేజింగ్‌లో గుర్బాజ్ వరుసగా మూడు సిక్సర్లు కొట్టి దక్షిణాఫ్రికాను వణికించాడు. కానీ ఆఖరి బంతికి క్యాచ్ అవుట్ కావడంతో 4 రన్స్ తేడాతో సఫారీలు విక్టరీ కొట్టారు.

## ఆస్పత్రిలో అభిషేక్ శర్మ..
## నమీబియాతో మ్యాచ్‌లో ఆడేది డౌటే !



ముంబై :
ఇండియన్ ఓపెనింగ్ బ్యాటర్ అభిషేక్ శర్మ ఆస్పత్రి పాలయ్యారు. కడుపు ఇన్‌ఫెక్షన్ వల్ల అతన్ని ఆస్పత్రిలో చేర్పించారు. దీంతో అతను టీ20 వరల్డ్‌కప్‌లో నమీబియాతో జరిగే మ్యాచ్‌లో ఆడేది అనుమానంగా ఉన్నది. గ్రూప్ స్టేజ్‌లో గురువారం నమీబియాతో మ్యాచ్ జరగాల్సి ఉన్నది. అయితే అమెరికాతో మ్యాచ్ జరగడానికి ముందు కూడా అతని ఆరోగ్యం సరిగా లేదని తెలిసింది. మ్యాచ్ ఆడిన తర్వాత అభిషేక్ ఆరోగ్యం క్షీణించినట్లు తెలిసింది. అధిక ఉష్ణోగ్రతలతో అతను బాధపడ్డాడు. అమెరికాతో మ్యాచ్ ముందు అతనికి రిలీఫ్ మెడిసిన్ ఇచ్చారు. తాజాగా ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో జరిగిన ప్రాక్టీస్ సెషన్‌కు అతను హాజరుకాలేదు. అభిషేక్‌కు ఇంకా కొన్ని ఉదర సమస్యలు ఉన్నాయని, మరో రెండు రోజుల్లో అతను అందుబాటులోకి వస్తాడని ఆశిస్తున్నట్లు అసిస్టెంట్ కోచ్ ర్యాన్ టెన్ డొస్కెట్ తెలిపారు. అమెరికాతో మ్యాచ్‌లో అభిషేక్ డకౌట్ అయ్యాడు. ఆ తర్వాత అతను ఫీల్డింగ్ చేసేందుకు క్రీజ్‌కు రాలేదు. ఆ మ్యాచ్‌లో సంజూ శాంసన్ ఫీల్డింగ్ చేశాడు.ప్రస్తుతం ఢిల్లీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అభిషేక్ ఎప్పుడు డిశ్చార్జ్ అయ్యేది తెలియదని, అతను నమీబియాతో మ్యాచ్‌లో ఆడేది అనుమానంగా ఉన్నట్లు బీసీసీఐ వర్గాలు పేర్కొన్నాయి.

# రెండో మ్యాచ్‌కు టీమిండియా సిద్ధం


**టీమిండియా ముమ్మరంగా సాధన**
**నేడు నమీబియాతో అమీతుమీ**
**గ్రూప్-ఏలో ఢిల్లీ వేదికగా మ్యాచ్**
**సంజూ శాంసన్ ఓపెనర్‌గా బరిలోకి..**
**అభిషేక్ శర్మకు విశ్రాంతినిచ్చే చాన్స్**

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీని ఘనంగా ప్రారంభించిన టీమిండియా.. రెండో మ్యాచ్‌కు సిద్ధమైంది. గ్రూప్-ఏలో భాగంగా ఢిల్లీ వేదికగా జరిగే మ్యాచ్‌లో నమీబియాతో అమీతుమీ తేల్చుకోనుంది. అమెరికాతో జరిగిన తొలి మ్యాచ్‌లో అతి కష్టం మీద గెలిచిన టీమిండియా.. ఈ మ్యాచ్‌లో దుమ్మురేపాలని భావిస్తోంది. ఆదివారమే ఢిల్లీకి చేరుకున్న టీమిండియా ముమ్మరంగా సాధన చేస్తోంది.అయితే ఈ మ్యాచ్‌కు ముందు టీమిండియాకు ఎదురుదెబ్బ తగిలింది. విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మ ఈ మ్యాచ్ ఆడటం సందేహంగా మారింది. ప్రస్తుతం అతను ఉదర సంబంధిత సమస్యలతో బాధపడుతున్నాడు. అమెరికాతో మ్యాచ్‌లోనూ ఇదే సమస్యతో బ్యాటింగ్ చేసిన అభిషేక్ శర్మ ఫీల్డింగ్‌కు రాలేదు. అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న అభిషేక్ శర్మ మంగళవారం



ప్రాక్టీస్ సెషన్‌లో కనిపించలేదు. అభిషేక్ శర్మ ఉదర సంబంధిత సమస్యలతో బాధపడుతున్నాడని బ్యాటింగ్ కోచ్ ర్యాన్ టెన్ డస్కాటే మీడియాకు తెలిపాడు. మ్యాచ్‌కు ఇంకా రెండు రోజుల సమయం ఉందని, ఆ సమయానికి కోలుకుంటాడని ఆశిస్తున్నామని చెప్పాడు. మరోవైపు సంజూ శాంసన్ నెట్స్‌లో తీవ్రంగా ప్రాక్టీస్ చేశాడు. మరో ఓపెనర్ ఇషాన్ కిషన్‌తో కలిసి బ్యాటింగ్ సాధన చేశాడు. ఈ క్రమంలోనే నమీబియాతో మ్యాచ్‌లో సంజూ శాంసన్ ఓపెనర్‌గా బరిలోకి దిగే అవకాశాలు ఉన్నాయి. ముందస్తు చర్యల్లో భాగంగా నమీబియాతో మ్యాచ్ నుంచి అభిషేక్ శర్మకు విశ్రాంతి కల్పించనున్నారు.న్యూజిలాండ్‌తో సిరీస్‌లో దారుణంగా విఫలమై తుది జట్టులో చోటు కోల్పోయిన సంజూ శాంసన్‌కు ఇది సువర్ణవకాశం. ఈ మ్యాచ్‌లో అతను భారీ ఇన్నింగ్స్‌తో చెలరేగితే.. తుది జట్టులో కొనసాగుతాడు. ఓపెనర్లు ఇద్దరూ లెఫ్టార్మ్ బ్యాటర్లే అయిన నేపథ్యంలో సంజూ శాంసన్ ఫామ్‌లోకి వస్తే అతనికి ప్రాధాన్యత లభిస్తోంది.తీవ్ర జ్వరంతో అమెరికాతో మ్యాచ్‌కు దూరమైన జస్‌ప్రీత్ బుమ్రా రీఎంట్రీ ఇవ్వనున్నాడు. అదే జరిగే మహమ్మద్ సిరాజ్‌పై వేటు పడనుంది. అమెరికాతో మ్యాచ్‌లో సిరాజ్ మూడు వికెట్లతో సత్తా చాటాడు. అయినప్పటికీ బుమ్రా రీఎంట్రీతో అతను బెంచ్‌కే పరిమితం కానున్నాడు. ఎక్స్‌ట్రా స్పిన్నర్‌తో బరిలోకి దిగితే అర్ష్‌దీప్ సింగ్ కూడా బెంచ్‌కే పరిమితమవుతాడు. అతని స్థానంలో కుల్దీప్ యాదవ్ ఆడుతాడు.మిగతా కాంబినేషన్‌లో ఎలాంటి మార్పులు జరిగే అవకాశం లేదు. ఇషాన్ కిషన్, తిలక్ వర్మ, శివమ్ దూబే, రింకూ సింగ్, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్ బ్యాట్ ఝులిపించాల్సిన అవసరం ఉంది.







## నెట్టింట 'చిట్టి' హాట్ షో..

# ఒక్క సినిమా రిలీజ్ కాలేదు..

## అప్పుడే ఆఫర్స్ పట్టేస్తోన్న హీరోయిన్..

ఇన్ స్టా రీల్స్ ద్వారా పాపులర్ అయ్యింది. దీంతో ఏకంగా పాన్ ఇండియా స్టార్ సరసన ఛాన్స్ కొట్టేసింది. మొదటి సినిమా ఇంకా విడుదల కాలేదు. అప్పుడే వరుస అవకాశాలు అందుకుంటూ టాలీవుడ్ ఇండస్ట్రీలో బిజీ హీరోయిన్ అయ్యింది ఈ ముద్దుగుమ్మ. ఇంతకీ ఆమె ఎవరో తెలుసా.. .?ఆమె మరెవరో కాదండి.. హీరోయిన్ ఇమాన్వి. డైరెక్టర్ హను రాఘవపూడి దర్శకత్వంలో ప్రభాస్ నటిస్తున్న ఫౌజీ మూవీ హీరోయిన్. ఈ సినిమాతో తెలుగు తెరకు పరిచయం అయ్యేందుకు ఎదురుచూస్తుంది ఇమాన్వి. కొన్ని రోజులుగా ఈ మూవీ షూటింగ్ జరుగుతుంది.కథానాయికగా ఇమాన్వికి ఇదే మొదటి సినిమా. అంతకు ముందు ఆమె సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్. నెట్టింట పాపులర్ అయిన ఈ ముద్దుగుమ్మ ఏకంగా ప్రభాస్ జోడిగా సెలక్ట్ చేశారు డైరెక్టర్ హను రాఘవపూడి. తాజాగా ఈ ముద్దుగుమ్మ మరో ఛాన్స్ కొట్టేసిందట.పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా డైరెక్టర్ సురేందర్ రెడ్డి ఓ సినిమా చేయనున్నారు. ఈ ఏడాది ఉగాది సందర్భంగా ఈ మూవీని అధికారికంగా ప్రకటించనున్నారు. ఈ సినిమాలో కథానాయికగా ఇమాన్విని ఎంపిక చేసినట్లుగా ప్రచారం జరుగుతుంది.దీనిపై త్వరలోనే అధికారిక ప్రకటన రానున్నట్లు తెలుస్తోంది. ఒక్క సినిమా విడుదల కాకముందే ఆమెకు వరుసగా అవకాశాలు తలుపుతట్టినట్లు తెలుస్తోంది. మరోవైపు ఈ అమ్మడు సోషల్ మీడియాలో బిజీగా ఉన్నట్లు తెలుస్తోంది.

# మత్తెక్కిస్తున్న ముద్దుగుమ్మ..

## తేజస్వి మదివాడ లేటెస్ట్ పిక్స్ అదుర్స్

చాలా మంది చైల్డ్ ఆర్టిస్ట్ ఇప్పుడు హీరోలుగా, హీరోయిన్స్ గా రాణిస్తున్నారు. ఇప్పటికే చాలా మంది చైల్డ్ ఆర్టిస్ట్ లు హీరోలుగా హీరోయిన్స్ గా రాణిస్తున్నారు. తేజ సజ్జ, కావ్య కళ్యాణ్ రామ్, నిత్యా శర్మ ఇలా చాలా మంది ఇప్పుడు సినిమాలతో బిజీగా ఉన్నారు.అలాంటి వారిలో తేజస్వి మదివాడ ఒకరు. సీతమ్మవాకిట్లో సిరిమల్లె చెట్టు సినిమాతో ఫేమస్ అయిన తేజస్వి మదివాడ. ఆర్జీవీ తెరకెక్కించిన ఐస్ క్రీమ్ సినిమాలో సోలో హీరోయిన్ గా నటించినా, ఆ తర్వాత సెకెండ్ ఫీమేల్ లీడ్, క్యారెక్టర్ ఆర్టిస్టుగానే ఎక్కువగా కనిపించింది.బిగ్ బాస్ హౌజ్ లో అడుగు పెట్టి బుల్లితెర ఆడియెన్స్ కు చేరువైన తేజస్వి మదివాడ ప్రస్తుతం టీవీ షోలతో బిజీబిజీగా ఉంటోంది. అలాగే పలు సినిమా ఈవెంట్స్ లోనూ సందడి చేస్తోంటోంది. ఇక సోషల్ మీడియాలో ఫుల్ యాక్టివ్ గా ఉంటుందీ అమ్మడు.ఈ అమ్మడి గ్లామరస్ ఫోటోలు తెగ వైరల్ అవుతున్నాయి. నిత్యం తన లేటెస్ట్ క్రేజీ ఫొటోస్, వీడియోలను షేర్ చేస్తూ ఫాలోవర్లతో టచ్ లో ఉంటోంది. అయితే ప్రస్తుతం తేజస్వి మదివాడ సినిమాల స్పీడ్ తగ్గించింది. కొన్ని వెబ్ సిరీస్ ల్లో నటిస్తుంది.సినిమాలతో పాటు సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే ఈ చిన్నది. పలు టీవీ షోల్లోనూ పాల్గొంటుంది. నెట్టింట ఈ ముద్దుగుమ్మ షేర్ చేసే ఫోటోలు కుర్రాళ్ళ మతులు పోగొడుతున్నాయి. ఓ రేంజ్ లో గ్లామర్ ఒలకబోస్తూ ఫోటోలు పంచుకుంటుంది ఈ అందాల భామ.



# యోధుడిగా నిఖిల్..


## 'స్వయంభు' టీజర్ విడుదల




యంగ్ హీరో నిఖిల్ సిద్దార్థ్ కెరీర్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న పీరియాడికల్ యాక్షన్ డ్రామా 'స్వయంభు'. సమ్మర్ కానుకగా ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. ఈ సినిమా టీజర్‌ను చిత్రబృందం నేడు విడుదల చేసింది. పాన్ ఇండియా స్థాయిలో అత్యున్నత సాంకేతిక విలువలతో, 3ఐ ఫార్మాట్‌లో రూపొందిన ఈ టీజర్ ప్రేక్షకులను కట్టిపడేస్తోంది.భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో నిఖిల్ క్రీస్తుశకం 985 నాటి పరాక్రమవంతుడైన యోధుడిగా కనిపిస్తున్నారు. భారీ సెట్టింగ్‌లు, అద్భుతమైన పీరియడ్ వార్ సీక్వెన్స్‌లతో కూడిన ఈ టీజర్, నిఖిల్ మేకోవర్ మరియు ఆయన యుద్ధ విన్యాసాలను అద్భుతంగా ఆవిష్కరించింది. సంయుక్త మీనన్, నభా నటేష్ హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రానికి 'కేజీఎఫ్', 'సలార్' చిత్రాల ఫేమ్ రవి బస్రూర్ సంగీతాన్ని అందిస్తుండగా, ప్రముఖ సినిమాటోగ్రాఫర్ కె.కె. సెంథిల్ కుమార్ విజువల్స్ సమకూర్చారు. 'కార్తికేయ-2' విజయం తర్వాత నిఖిల్ నటిస్తున్న ఈ చిత్రంపై టాలీవుడ్‌తో పాటు దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి.

## వాలెంటైన్స్ డే స్పెషల్..

# 25 ఏండ్ల తర్వాత 'మనసంతా నువ్వే' రీ-రిలీజ్




టాలీవుడ్ లవర్ బాయ్, దివంగత నటుడు ఉదయ్ కిరణ్ కెరీర్‌లో క్లాసిక్ హిట్‌గా నిలిచిన 'మనసంతా నువ్వే' మరోసారి థియేటర్లలో సందడి చేసేందుకు సిద్ధమైంది. సరిగ్గా 25 ఏండ్ల క్రితం విడుదలైన ఈ అద్భుత ప్రేమకథా చిత్రాన్ని ఈ ఏడాది ప్రేమికుల రోజు సందర్భంగా ఫిబ్రవరి 14న గ్రాండ్‌గా రీ-రిలీజ్ చేయబోతున్నారు మేకర్స్. ఎం.ఎస్. రాజు నిర్మాణంలో, వి.ఎన్. ఆదిత్య దర్శకత్వంలో వచ్చిన ఈ మూవీ అప్పట్లో సెన్సేషన్ క్రియేట్ చేయడమే కాకుండా, ఉదయ్ కిరణ్ ఇమేజ్‌ను శిఖరాగ్రానికి తీసుకెళ్లింది. ఇప్పుడు అదే మ్యాజిక్‌ను వెండితెరపై మళ్ళీ తీసుకురాబోతున్నారు. నిరంజన్ రెడ్డి, చైతన్యా రెడ్డి, రఘురామ్ రెడ్డి, రవికాంత్ రెడ్డి సంయుక్తంగా ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు.అయితే ఈ రీ-రిలీజ్ సందర్భంగా ఉదయ్ కిరణ్ కుటుంబ సభ్యులు ఎమోషనల్ వీడియోలను షేర్ చేస్తూ తమ సంతోషాన్ని పంచుకున్నారు. ఉదయ్ కిరణ్ మేనకోడలు మహతి మాట్లాడుతూ.. ఈ సినిమా విడుదలైనప్పుడు తనకు కేవలం రెండు నెలల వయస్సు మాత్రమేనని, ఇప్పుడు ఇన్నేళ్ల తర్వాత తన మామయ్య సినిమాను వెండితెరపై చూడటం చాలా స్పెషల్ అని పేర్కొంది. మరోవైపు మేనల్లుడు తేజ స్పందిస్తూ.. ఆనాడు సినిమా విడుదలైనప్పుడు తనకు ఏడేళ్లని, ఇప్పుడు ఇన్నేళ్ల తర్వాత కూడా మామయ్యపై ప్రేక్షకులు చూపిస్తున్న ఆదరణ చూస్తుంటే గర్వంగా ఉందని తెలిపాడు. తన మామయ్య జ్ఞాపకాలను మళ్ళీ గుర్తు చేసుకుంటూ కుటుంబం మొత్తం కలిసి థియేటర్లలో ఈ సినిమాను చూస్తామని అతను ఆకాంక్షించారు. నేటి తరం ప్రేక్షకులకు కూడా ఒక స్వచ్ఛమైన ప్రేమకథను పరిచయం చేస్తూ, రీమా సేన్, తనూ రాయ్‌ల నటన, ఆర్.పి. పట్నాయక్ అందించిన మధురమైన గీతాలతో ఈ సినిమా ప్రేమికుల రోజున థియేటర్లలో మరోసారి మారుమోగనుంది.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com